ధర్మఘంటి
జాతీయ తెలుగు దినపత్రిక
TELTEL/2012/47103

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 217 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | మంగళవారం 4 నవంబర్ 2025 | పేజీలు : 8 | వెల : 1

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

### మరోసారి షాకిచ్చిన బంగారం, వెండి ధరలు

మన ఇంట్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా బంగారం కొనుగోలు చేస్తుంటారు. ఇక అందులోనూ మన దేశంలో గోల్డ్‌కి మరింత పాపులారిటీ ఎక్కువ. ఇక ఈ మధ్య కాలంలో బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒకరోజు రేట్లు తగ్గి కాస్త ఊరటనిస్తుంటే మరో రోజు పెరిగి అమ్మో అనిపిస్తున్నాయి.

### విదేశీ మారకం నిల్వల్లో భారీ పతనం

భారతదేశ విదేశీ మారకం నిల్వల్లో భారీ తగ్గుదల చోటు చేసుకుంది. అక్టోబర్ 24తో ముగిసిన వారంలో ఏకంగా 6.9 బిలియన్ డాలర్లు తగ్గి 695.355 బిలియన్లకు చేరుకున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తెలిపింది. ఇది ఇంతక్రితం వారంలో నమోదైన 702.28 బిలియన్లతో పోల్చితే తగ్గుదలను సూచిస్తుందని వెల్లడించింది. ఫారెక్స్ నిల్వలలో ప్రధాన భాగం అయినా విదేశీ కరెన్సీ ఆస్తులు సమీక్షా వారంలో 3.862 బిలియన్ డాలర్లు తగ్గి 566.548



### పత్తి రైతులను తేమ పేరిట

# మోసం చేస్తున్నారు

**సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెడుతున్నారు**

**వేరే దిక్కు లేక రైతులు ప్రైవేటుకు అమ్ముకుంటున్నారు**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**

ఆదిలాబాద్

రాష్ట్రంలో పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని.. తేమ పేరిట రైతులను మోసం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. వేరే దిక్కు లేక రైతులు ప్రైవేటుకు - మిగతా3లో

### ఎస్ఎల్‌బీసీ టన్నెల్ విషయంలో

# రాజకీయం తగదు

- టన్నెల్ పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్న రేవంత్ రెడ్డి
- టన్నెల్ బోర్ మిషన్‌తో పనులు పూర్తి చేయడం కష్టంగా మారిందని వ్యాఖ్య
- బీఆర్ఎస్ హయాంలో 10 కిలోమీటర్లు కూడా పూర్తి చేయలేకపోయారని విమర్శ
- కమీషన్లు రావని ఎస్ఎల్ బిసి టన్నెల్ ప్రాజెక్టును పక్కకు పెట్టారు
- టిఆర్ఎస్ ప్రభుత్వం పై నిప్పులు చెరిగిన సిఎం రేవంత్ రెడ్డి



నాగర్ కర్నూలు

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ విషయంలో బీఆర్ఎస్ రాజకీయం చేయడం సరికాదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నాగర్ కర్నూలు జిల్లా మన్నెవారిపల్లెలో పర్యటించిన ముఖ్యమంత్రి, హెలీ మాగ్నటిక్ సర్వేకు సిద్ధంగా ఉన్న హెలికాప్టర్, ఆధునాతన పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అన్నారు. టన్నెల్ బోర్ మిషన్‌తో పనులు చేయడం కష్టంగా మారిందని అన్నారు. ఈ పనులపై రాజకీయం చేయవద్దని కోరారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా టన్నెల్ పనులు పూర్తి చేసి తీరుతామని అన్నారు. ప్రాజెక్టు మంజూరు చేసినప్పుడు పనుల అంచనా విలువ రూ. 1,986 కోట్లు అని, రెండు దశాబ్దాల్లో - మిగతా3లో



## ట్రక్ బీభత్సం

- 19 మంది దుర్మరణం
- 50 మందికి గాయాలు
- 17కు పైగా వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి
- అతి వేగంతో వచ్చిన డంపర్ ట్రక్ ముందుగా ఓ కారును ఢీకొట్టింది
- ప్రమాద సమయంలో డంపర్ డ్రైవర్ మద్యం సేవించినట్లు సమాచారం.

## అనవసర అంశాలపైనే ప్రసంగాలు'

- ప్రధానిపై ప్రియాంక గాంధీ విసుర్లు!
- రాష్ట్రంలో ఎన్డీయే సర్కారు అవినీతి, దుష్పరిపాలనపై మాత్రం నోరు మెదపడం లేదు
- ప్రతిపక్ష నేతలు దేశాన్ని, బిహార్‌ను అవమానిస్తున్నారంటూ ప్రధాని మోదీ పదేపదే ఆరోపిస్తున్నారు
- కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారాలపైనే ఎక్కువ దృష్టి సారించినట్లు కనిపిస్తోంది



## రూ.3వేల కోట్లు కొల్లగొట్టారు

- డిజిటల్ అరెస్టులపై కఠినచర్యలు
- "ఒక్క మనదేశంలోనే ఈ అరెస్టు బాధితుల నుంచి రూ.3వేల కోట్లు కొల్లగొట్టడం దిగ్భ్రాంతికరం
- ఈ నేరగాళ్లు పెచ్చుమీరిపోతారు
- వీటికి అడ్డుకట్టవేసేలా కఠినచర్యలు తీసుకోవాలని నిశ్చయించుకున్నాం



### పత్తి కొనుగోళ్లలో

## సీసీఐ నిబంధనలు మార్చండి

- కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ
- "ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పత్తి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.
- కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తాకు లేఖ
- సీసీఐ తీసుకొచ్చిన కొత్త నిబంధన పత్తి రైతులకు నష్టం చేసేలా ఉంది
- తేమ శాతం విషయంలో 20శాతం వరకు ఉన్నా సరే పత్తి పంట సీసీఐ కొనుగోలు చేయాలి
- కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన లేకపోవడం వల్ల కూడా పత్తి రైతులకు ఇబ్బందులు తలెత్తాయి.





## భారత పుత్రికలు చరిత్ర సృష్టించారు

- ప్రైవేట్‌రంగంలో పరిశోధనలు ప్రోత్సహించేందుకు రూ.లక్ష కోట్లతో నిధి
- విజయాన్ని చూసి గర్విస్తున్నా నని.. ఈ విజయం దేశంలోని కోట్లాది మంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తుంది
- శాస్త్రవేత్తలు అత్యంత బరువైన కమ్యూనికేషన్ శాటిలైట్‌ను విజయవంతంగా ప్రయోగించారు
- ఎన్డీయే అంటే వికాసం.. మహాగఠ్ బంధన్ అంటే వినాశనం
- రాష్ట్రంలో మరోసారి ఏన్డీయే ప్రభుత్వం ఏర్పడేలా తొలిసారి ఓటువేసే వారు తమ హక్కును వినియోగించుకోవాలి

### రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు

# కఠిన చర్యలు

- ప్రమాదాలు జరుగకుండా రవాణా శాఖ అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి
- వాహనాల స్పీడ్ లాక్ ఎంత వరకు అమలవుతున్నాయో అధికారులు పర్యవేక్షించాలి
- రవాణా శాఖ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీరియస్‌గా ఉండాలి
- చేవెళ్ల, తదితర ఘటనలు జరిగినప్పుడు అధికారులు తనిఖీలు చేయడమే కాదని నిరంతరం యాక్షన్ ప్లాన్ ఉండేలా కఠినంగా వ్యవహరించాలి

హైదరాబాద్



తెలంగాణ రాష్ట్రంలో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని ... ప్రమాదాలు జరుగకుండా రవాణా శాఖ అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు. సోమవారం రవాణా శాఖ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి , జేటీసీలు, డీటీసీలు, ఇతర రవాణా శాఖ అధికారులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా అధికారులకి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈరోజు జరిగిన చేవెళ్ల ప్రమాదంలో రెండు వాహనాలకు - మిగతా3లో



### పరిస్థితి దిగజారినప్పుడు కాదు..

## ముందుగానే సిద్ధం కావాలి

- ఢిల్లీ వాయు కాలుష్యంపై 'సుప్రీం' వ్యాఖ్యలు..!
- పరిస్థితి మరింత దిగజారినప్పుడు మాత్రమే అధికారులు చర్యలు తీసుకోకూడదు
- 37 స్టేషన్లలో తొమ్మిది మాత్రమే నిరంతరాయంగా పని చేస్తున్నాయి
- ఏజెన్సీలు 'ప్రతిస్పందించడానికి బదులు'గా.. 'ముందుగానే సిద్ధం' కావాలని స్పష్టం

# చేవెళ్లలో ఘోర ప్రమాదం




- ప్రయాణికుల నరకయాతన
- రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆర్టీసీ బస్సును ఢీకొని, మీద పడిన కంకర లారీ
- ప్రమాదంలో 20 మంది ప్రయాణికులు అక్కడికక్కడే మృతి
- మృతుల్లో బస్సు, లారీ డ్రైవర్లతో పాటు మహిళలు, చిన్నారి
- ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు, ముగ్గురి పరిస్థితి విషమం
- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం ఆదేశాలు

హైదరాబాద్

రంగారెడ్డి జిల్లాలో తాండూరు డిపో ఆర్టీసీ బస్సును కంకర లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టిన ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద ఆర్టీసీ బస్సును, రాంగ్ రూటులో వచ్చిన కంకర లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. అనంతరం బస్సు మీద లారీ ఒరిగి పడిపోయింది. లారీ లోని కంకర లోడ్ వర్షం కురిసినట్లుగా బస్సులోని వారిని కమ్మేసింది. ఈ ప్రమాదంలో మరణించిన వారిలో అత్యధికంగా మహిళలే ఉన్నారు. కొందరు ప్రయాణికులు ఆ కంకర - మిగతా3లో

# సంపాదకీయం

## రైతుల వెన్నువిరుస్తున్న విపత్తులు!

తెలుగు రాష్ట్రాలను, అందులో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌ను కకావికలం చేసిన మొంథా తుపాను సృష్టించిన విలయానికి తీరప్రాంత ప్రజల జీవనం అస్తవ్యవస్థమై_పోయింది. తుపాను ధాటికి పంటలు నీట మునిగి రైతులు నిండా మునిగి పోయారు. ఎటు చూసినా పంట పొలాలు సముద్రాలను తలపించాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు నీటి పాలు కావడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. పొట్ట దశలో ఉన్న వరి పంట నీళ్లలో తెలియాడుతుంది. పూత కాత దశలోని పత్తి, ఇతర పంటలు మురిగి పోతున్నాయి. కళ్లాల్లో ఆరబెట్టిన వరి, మొక్కజొన్న చేతికి అందకుండా పోయింది. మిర్చి, మొక్కజొన్న, కందులు, పెసరతో పాటు బొప్పాయి, అరటి వంటి ఉద్యానవన పంటలూ ప్రకృతి ప్రకోపానికి గురయ్యాయి. ఎడతెరిపి లేని కుండపోత వానలకు తోడు తుపాన్ తీరం దాటేవేళ విరుచుకుపడ్డ పెనుగాలుల బీభత్సం రైతులకు అపార కష్టం మిగిల్చింది. చేతికొచ్చిన పంటలు నీట మునగ డంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రతి సీజన్‌లోనూ, పకృతి వ్యవసాయ రంగానికి ఒక సవాల్ విసురుతుంది. ప్రతికూల వాతావరణం ప్రతిఫలం రైతు చేతికి అందకుండా చేస్తుంది. రైతుకు కష్టాలే పెట్టుబడి, కన్నీళ్లే దిగుబడిగా మారింది. ప్రతి ఏడాది రైతులకు వాయుగండమే. ఈ ఏడాది కూడా వదలలేదు. వరుణ దేవుడు పంట చేతికి వస్తుందనుకుంటున్న సమయానికి తన ప్రతాపం చూపనే చూపాడు. మొంథా తుఫాన్ దాటికి 17 శాఖలకు చెందిన వివిధ రంగాలకు మొత్తం రూ.5,244 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇవి ప్రాథమిక అంచనాలు మాత్రమే, పూర్తిస్థాయి వివరాలు అందాక నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది. 250 మండలాల పరిధిలోని 1,434 గ్రామాలు, 48 పట్టణాలపై తుపాన్ ప్రభావం పడింది. 161 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు సమాచారం. ప్రభుత్వం సచివాలయంలో రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) కార్యాలయం నుంచి 'మొంథా' గమనాన్ని పరిశీలిస్తూ.. ఎప్పటికప్పుడు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఆస్తి నష్టం, ప్రాణ నష్టం లేకుండా నివారించింది. అయినా నష్టం సంభవించింది. వ్యవసాయ రంగానికి సంబంధించి 1.38 లక్షల హెక్టార్ల లోని 2.96 లక్షల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు దెబ్బతిని దాదాపు రూ. 829 కోట్ల మేర రైతులు నష్టపోయినట్లు సమాచారం. మొత్తం 1.74 లక్షల మంది రైతులపై తుపాన్ ప్రభావం పడింది. 12,215 హెక్టార్లలో రూ.40 కోట్ల విలువైన ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 23,979 మంది రైతులకు నష్టం వాటిల్లింది. ఆక్వా రంగంలో 32 వేల ఎకరాల్లోని రూ.514 కోట్ల విలువైన పంటను నష్ట పోయారు. 2,261 పశుసంపదను పశుపోషకులు కోల్పోయారు. 4,794 కిలోమీటర్ల ఆర్ అండ్ బీ రోడ్లు, 311 కల్వర్టులు, వంతెనలు దెబ్బతిన్నాయి. ఈ నష్టం రూ.2,774 కోట్ల వరకు ఉంది.?ఇక రాష్ట్ర వ్యాప్తంగా 2,817 విద్యుత్ స్తంభాలు నేలకొరగ్గా.. 26,575 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. 429 కిలోమీటర్ల మేర విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ శాఖకు రూ.19 కోట్ల నష్టం జరిగినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం విపత్తు బాధితులను ఆదుకునే పరిస్థితి లేదు. గతంలో వలే కేంద్ర ప్రభుత్వం అరకొర సాయం చేసి చేతులు దులుపుకోకుండా రాష్ట్రాన్ని పూర్తి స్థాయిలో ఆదుకోవడానికి ముందుకు రావాలి. వానలొచ్చి పంటలు పాడైన ప్రతీ రైతన్నను ఆదుకోవాలి. ఆపత్కాలంలో సత్వరం సరైన చేయూత అందిస్తేనే రైతుల బతుకులు తెరిపిన పడతాయి. ప్రకృతి ఉత్పాతాలకు బలైన రైతులను ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వం మానవీయంగా వ్యవహరించాలి. విపత్తులు నష్టాన్ని అంచనా వేయడానికి వచ్చే కేంద్ర బృందాలు వారికి తీరినప్పుడు నష్టం అంచనా వేయడానికి చుట్టపు చూపుగా రావడం తప్ప రాష్ట్రానికి వస్తున్న పరిహారం అరకొరే. విపత్తుల వల్ల జరిగిన నష్టాన్ని కచ్చితంగా అంచనా వేసేందుకు సరైన నమూనా అను సరించడం లేదు. ఖరీఫ్‌లో పంటలు దెబ్బ తింటే నష్టం అంచనా వేయడానికి రబీలో వస్తారు. రబీ పంటలు దెబ్బ తింటే ఖరీఫ్‌లో వస్తున్నాయి ఈ కేంద్ర బృందాలు.. పైగా నష్టం అంచనా వేయటానికి వచ్చే కేంద్ర బృందాలు రహదారుల పక్కన ఉన్న పంటల పొలాలను మాత్రమే పరిశీలిస్తున్నాయి. మారుమూల గ్రామాలకు వెళ్లటం లేదు. కొన్ని చోట్ల కేవలం ఫోటో ప్రదర్శనలకే పరిమితం అవుతున్నారు. దీనివల్ల పంట నష్టం పూర్తిస్థాయిలో అంచనా వేయటం సాధ్యమా? ఆ మాత్రం దానికి హంగు అర్భాటలతో ఢిల్లీ నుంచి రావడం ఎందుకు? అలాగే కేంద్ర బృందాలు నష్టం అంచనా వేసి కేంద్ర ప్రభుత్వానికి అందిస్తే వారు విదిలింపులతో సరిపెడు తున్నారు. విపత్తుల కారణంగా రైతులు ఏటా 50 % మేరకు పంటలు నష్టపోతున్నట్లు సమాచారం. రైతు పెట్టిన పెట్టుబడిలో 10% కూడా నష్టం అందని పరిస్థితి. కేంద్ర ప్రభు త్వం నిబంధనలు రైతును ఆదుకునే విధంగా లేవు. రైతుకు అతి పెద్ద నష్టం విపత్తుల వల్లనే, దీని నుంచి రైతును రక్షించడానికి మార్గాలు అన్వేషించాలి కేంద్ర ప్రభుత్వం. అట్లాగే అభివృద్ధి చెందుతున్న దేశాలు పురోభివృద్ధి పేరిట పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నాయి. మానవ తప్పిదాల మూలంగానే విపత్తులు వ్యవసాయరంగం వెన్ను విరుస్తున్నాయి.

# అసమాన మేధావి శకుంతలా దేవి



ఆమె అంక గణితంలో నిపుణురాలు. గణితావధాని. చాలా వేగంగా గణనలు చేయగల సామర్థ్యం కలిగిన ఆమెను "మానవ కంప్యూటర్" అని పిలుస్తారు. గణిత మాంత్రికు రాలిగా సుప్రసి ద్ధులు. శతాబ్దంలో ఆమెకు ఏదైనా తేదీ ఇస్తే, అది వారంలో ఏ రోజు పడిపోయిందో చెప్పగలిగిన అసాధారణ ప్రజ్ఞాశాలి. మైండ్ డైనమిక్స్' అని పిలిచే భావనను అభివృద్ధి చేసిన మేధావి. ఆమెనే మానవ నిర్మిత కంప్యూటర్ కన్న గొప్ప గణకురాలిగా ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందిన గణిత శాస్త్ర వేత్త శకుంతలా దేవి. శకుంతలా దేవిని (నవంబరు 4, 1929 -ఏప్రిల్ 21, 2013 ) మానవ గణన యంత్రము అని పిలుస్తారు. ఆమె ప్రపంచ వ్యాప్తంగా అనేక గణితావ ధానములు నిర్వహించి గణన యంత్రము కంటే వేగంగా పలు సమస్యలను పరిష్కరించారు. ప్రపంచంలో అతి వేగంగా గణనలు చేయుటలో గిన్నిస్ వరల్డ్ రికార్డును స్వంతం చేసుకున్నారు. బెంగళూరులోని బ్రాహ్మణ పూజారుల ప్రసిద్ధ కుటుంబంలో జన్మించిన శకుంతల దేవి తన తాత నుండి గణితంలో ప్రారంభ పాఠాలు పొందారు. ఐదు సంవత్సరాల వయస్సులో ఆమె చైల్డ్ ప్రాడిజీగా మరియు సంక్లిష్ట మానసిక అంక గణితంలో నిపుణురాలిగా గుర్తించ బడింది. ఆ చిన్న వయస్సులో, ఆమె క్యూబ్ మూలాలను లెక్కించటం వంటి గణిత సమస్య లను పరిష్కరించడంలో నిపుణు రాలు అయ్యింది. ఒక సంవత్సరం తరువాత మైసూర్ విశ్వ విద్యా లయంలోని విద్యార్థులు, ప్రొఫెసర్ల పెద్ద సమావేశానికి వెళ్ళి ఆమె తన ప్రతిభను ప్రదర్శించింది. ఎనిమిదేళ్ల వయసులో అన్నామలై విశ్వ విద్యాలయంలో ఆమె ప్రదర్శనతో శకుంతలాదేవిని బాలమేధావిగా గుర్తించారు. శకుంతలాదేవి 1960లో కోల్‌కతాకు చెందిన ఐఏఎస్ పరితోష్ బెనర్జీని వివాహం చేసుకున్నారు. బెనర్జీ స్వలింగ సంపర్కం గురించి వెల్లడి కావడంతో ఆ వివాహం త్వర లోనే విడిపోయింది. అయితే ఈ ఘటన శకుంతల దేవికి, ఉత్ప్రేరకంగా పనిచేసింది, ఆమె మానవత్వం గురించి లోతుగా పరిశోధించడానికి సహాయపడింది. 1977 లో ది వరల్డ్ ఆఫ్ హెూమో సెక్సువల్స్ అనే పుస్తకాన్ని రాయడానికి ఆమెను దారితీసింది. అమె రాసిన పుస్తకంలో స్వలింగ సంపర్కం అనైతికం అనే విషయాన్ని ఆమె సవాలు చేసింది. శకుంతలాదేవి తన సామర్థ్యాలను, తన సామర్థ్యాలను ఉపయోగించు కుంటూ, తన జీవితాన్ని అన్వే షించి, మానవత్వాన్ని చాటుకునే తపనతో, తన జీవితాన్ని గురించి ప్రసంగాలలో చెబుతూ ఉండేవారు. ఆమె ఎన్నో రచనకు చేశారు. మానవ మనస్సు కంప్యూటర్ కంటే సాటిలేని సామర్థ్యాలను కలిగి ఉందని, మానవ మనస్సును కంప్యూటర్లతో పోల్చడం సము చితం కాదని ఆమె అభిప్రాయ పడ్డారు. శకుంతలా దేవి తమ గణిత ప్రతిభను ప్రదర్శిస్తూ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో పర్యటించారు. ఆమె తన తండ్రితో కలిసి 1944 లో లండన్‌కు వెళ్లారు. ఆమె 1950 లో ఐరోపా పర్యటన 1976లో న్యూయార్క్ నగరంలో ప్రదర్శనలు ఇచ్చారు. 1988 లో, బర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వ విద్యాలయంలో విద్యా మనస్తత్వ శాస్త్రం ప్రొఫెసర్ ఆర్థర్ జెన్సన్ వద్ద అధ్యయనం చేయటానికి ఆమె వెళ్లారు. ఆర్థర్ జెన్సెన్ స్వయంగా శకుంతలా దేవి గణిత ప్రతిభను పరిశీలించి అవాక్కయ్యారు. 1977లో అమెరికాలో ఓసారి ఒక కంప్యూటర్ తో శకుంతలా దేవికి పోటీ పెట్టారు. 188132517 అనే సంఖ్యకు మూడో వర్గం కనుక్కో వడంలో పోటీ పెట్టగా, ఆమె కంప్యూటర్ ను ఓడించారు. 1980 జూన్ నెలలో 13 అంకెలున్న రెండు సంఖ్యలు తీసుకున్నారు. 76,86,36,97,74,870 అనే సంఖ్యతో 24,65,09,97, 45,779 అనే సంఖ్యను హెచ్చవేస్తే ఎంత వస్తుందని లండన్ ఇంపీరియల్ కాలేజిలోని కంప్యూటర్ విభాగంలోని ఓ సూపర్ కంప్యూటర్ శకుంతలా దేవిని ప్రశ్నించింది. దానికిఅయితే ఆమె కేవలం 28 సెకన్లలో... 18,947,668, 177,995, 426, 462, 773,730... సమాధానం ఇచ్చారు. అలా గిన్నీస్ బుక్ రికార్డ్ ఆమె సొంతం అయింది. ఆమె గత శతాబ్ద కాలంలో ఏ తేదీ చెప్పినా అది ఏ వారం అవుతుందో క్షణంలో ఆమె చెప్పేవారు. దేవి 1969 లో ఫిలిప్పీన్స్ విశ్వ విద్యాలయం విశిష్ట మహిళల పురస్కారాన్ని గెలుచుకుంది. ఆమె 1988 లో వాషింగ్టన్ డిసిలో రామానుజన్ మ్యాథమెటికల్ జీనియస్ అవార్డుతో సత్కరించింది. తమ 83వ ఏట 2013 ఏప్రిల్ 21న ఆమె బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో కన్ను మూశారు. గణితశాస్త్రాన్ని, ప్రాచీనకాలం నుండి ఎంతోమంది భారతీయులు అభివృద్ధి పరుస్తూ వచ్చారు. భారతీయ గణిత ఆవిష్కరణల్లో ముఖ్యమైనవిగా సున్నా వాడకం, బీజ గణితం వంటివాటిని చెబుతారు. ప్రపంచంలో మేధావులుగా గుర్తించ బడిన ఆర్యభట్ట, వరాహ మిహిర కాలం నుండి అంకగణిత ప్రాధాన్యత ఉన్నప్పటికీ, ఇటీవలి సంవత్సరాలలో విద్యార్థులలో గణిత ఫోబియా అధికం అవుతుంది. ఉన్నత చదువుల కోసం గణితాన్ని ఎంచుకునే విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నది. భారతదేశంలో సుమారు 1.3 మిలియన్ల పాఠశాలలు, 800 విశ్వవిద్యాలయాలను కలిగి ఉన్నా, గణిత ఉపాధ్యాయుల సంఖ్య నానాటికీ దిగదుడుపే అవుతున్నది. దేశంలో ఇంజనీరింగ్, ఉత్పత్తి, సమాచార సాంకేతికత, అంతరిక్ష తదితర శాస్త్రాలలో గణిత శాస్త్ర నిపుణులు అవసరం ఉన్న దృష్ట్యా, ప్రభుత్వాలు గణిత శాస్త్ర నిపుణులను తయారు చేయాల్సి ఉంది. అలాగే ఐదేళ్ళ నుండి 80ఏళ్ళ పైబడిన వయసు దాటే వరకు వరకు అవిశ్రాంతంగా కృషి గణిత శాస్త్రం లో విశేష కృషి చేసిన మాస్టర్ మైండ్ శకుంతలా దేవి ఆదర్శంగా, విద్యార్థులు భయాన్ని వీడి గణితంలో నిపుణులు కావలసిన అవసరం అనివార్యంగా ఉంది.

# పవిత్ర గ్రంథం భారత రాజ్యాంగం



రాజ్యాంగ ముసాయిదాను 21 ఫిబ్రవరి 1948 నాటికే పూర్తి చేశారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అధ్యక్షతన 04 నవంబర్ 1948 రోజున రాజ్యాంగ సభలో అధికారికంగా రాజ్యాంగ ముసాయిదాను ప్రవేశపెట్టిన కీలక ఘట్టం తర్వాత రాజ్యాంగ ముసాయిదాపై తొలి పఠనం ప్రారంభమైనది. ఈ రోజున రాజ్యాంగ ముసాయిదాపై లోతైన చర్చలు, సవరణలు ప్రతిపాదించడం జరిగింది. నాటి రాజ్యాంగ సభ(కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీ)లో ప్రతి సభ్యుడికి రాజ్యాంగ ముసాయిదా కాపీని అందించారు. తదుపరి 04 నవంబర్ నుంచి 09 నవంబర్ 1948 వరకు మొదటి పఠనం జరిగింది. ముసాయిదాపై దాదాపు 10 రోజున పాటు చర్చలు జరిగిన పిమ్మట 17 నవంబర్ 1948 వరకు కొనసాగాయి. రాజ్యాంగ సభలోని నాటి సభ్యులు రాజ్యాంగ ముసాయిదాలోని పలు అంశాలపై చర్చలు జరిపి సూచనలు, సవరణలు తెలియజేశారు. తదుపరి వివిధ అధికారిక వాటాదారుల సూచనల ఆధారంగా కొన్ని సవరణలు కూడా జరిగాయి. భారత రాజ్యాంగాన్ని 2 ఏండ్ల 11 నెలల, 18 రోజుల్లో తయారు చేయడం జరిగింది. రాజ్యాంగ సభ 11 సార్లు, 165 రోజుల పాటు సమావేశం అయ్యింది. ఇందులో 114 రోజులు రాజ్యాంగ రాతప్రతిపై చర్చకు వెచ్చించారు. రాతప్రతిలో 7,635 సవరణలు ప్రతిపాదించగా, అందులో 2,473 ప్రతిపాదనలను పరిశీలించి, చర్చించి, పరిష్కరిం చింది. భారత రాజ్యాంగాన్ని 26 నవంబర్ 1949న సభలో ఆమోదించారు. 24 జనవరి 1950న 284 మంది రాజ్యాంగ సభ్యులు చిరు జల్లు పడుతున్న శుభవేళ సంతకాలు చేసారు. 26 జనవరి 1950 రోజున భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన వేళ మనం గణతంత్ర దినోత్సవాన్ని ప్రతి ఏట ఒక పరమ పవిత్ర పర్వదినంగా, ఘనంగా నిర్వహించుకుంటున్నాం. ఆ రోజున భారత రాజ్యాంగ సభ రద్దయి, తాత్కాలిక పార్లమెంట్‌గా మారింది. 1952లో జరిగిన తొలి సాధారణ ఎన్నికల్లో కొత్త పార్లమెంట్ ఏర్పడింది. స్వతంత్ర భారత రాజ్యాంగాన్ని తయారు చేయడానికి ఒక రాజ్యాంగ సభ లేక రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేశారు. ఈ సభలో రాష్ట్ర శాసనసభల ద్వారా ఎన్నికైన సభ్యులు 292, భారత్ సంస్థానాల నుండి ఎన్నికైన సభ్యులు 93 మంది, ఛీఫ్ కమీషనర్ ప్రావిన్సుల ప్రతినిధులు నలుగురు కలిపి మొత్తం 389 మంది ఉన్నారు. రాజ్యాంగ సభ తొలి సమావేశం పార్లమెంట్ భవనంలో 09 డిసెంబర్ 1946న జరిగింది. జవహర్ లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, సర్దార్ పటేల్, ఆచార్య కృపలానీ, డా రాజేంద్రా ప్రసాద్?, సరోజినీ నాయుడు, బి ఆర్ అంబేద్కర్, టంగుటూరి ప్రకాశం పంతులు, పట్టాభి సీతారామరాజు మొదలైన సభ్యులు ఉన్నారు. రాజ్యాంగ రాతప్రతిని తయారు చేయడానికి బి ఆర్ అంబేద్కర్ అధ్యక్షతన డ్రాఫ్టింగ్ కమిటీని ఏర్పాటు చేసారు. భారత రాజ్యాంగంలో అవతారిక, ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, ఆదేశిక సూత్రాలు, కార్యనిర్వాహక వ్యవస్థ (ప్రభుత్వం, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రి మండలి), శాసన వ్యవస్థ (పార్లమెంట్, ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు, జిల్లా కోర్టు), రాష్ట్రాలు (శాసన సభ, శాసన మండలి, గవర్నర్, ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం), ఎన్నికల వ్యవస్థ (రాజకీయ పార్టీలు, లోకసభ, రాజ్యసభ, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, రాష్ట్ర పార్టీలు, రాష్ట్ర శాసన సభ, రాష్ట్ర శాసన మండలి, స్థానిక సంస్థల ఎన్నికలు) లాంటివి పొందుపరుచబడ్డాయి. ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగంగా భారత రాజ్యాంగం సగర్వంగా నిలుస్తున్నది. ఇందులో అవతారిక, 448 అధికరణాలు, 12 షెడ్యూళ్ళతో కూడిన మహా గ్రంథం మన రాజ్యాంగం. మొదట్లో అవతారికలా భారత దేశాన్ని సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా పేర్కొన్నారు. తదుపరి జరిగిన 42వ రాజ్యాంగ సమరణ ద్వారా సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా మార్చారు. నేటికి భారత రాజ్యాంగంలో మొత్తం 106 సవరణలు జరిగాయి. మొదటి రాజ్యాంగ సవరణ 1951లో జరుగగా, 106వ రాజ్యాంగ సవరణగా "నారీ శక్తి వందన్ చట్టం(చట్ట సభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు)" 2023లో జరిగింది. భారత రాజ్యాంగం దేశ ప్రజలకు శాంతి, సమైక్యత, సంపద, సౌభాగ్యాలను అందించే మహా గ్రంథంగా మనకు మార్గనిర్దేశనం చేస్తున్నది. సమయానుకూలంగా, ప్రాధాన్యతా క్రమంలో భారత రాజ్యాంగంలో సవరణలు చేస్తున్నాం. రాజ్యాంగం గురించి తెలుసుకోవడం మాత్రమే ముఖ్యం కాదని, దానిని తూచా తప్పకుండా పాటించాలనా మరిచిపోరాదు. రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తే భరతమాత పౌరులుగా జీవించే హక్కును కోల్పోతారు. భారతీయులకు పరమ పవిత్ర జీవన గ్రంథంగా భారత రాజ్యాంగం సదా పూజించబడాలి, ఆచరణ మార్గం చూపాలి.

# అపర అన్నవరం... మరో శబరి మల

"శ్రీ రత్నగిరీశాయ గౌతమీ తీరవాసినే, ఆదినారాయణాయ శ్రీసత్య దేవాయ మంగళమ్", తెలంగాణ ప్రాంతంలోనే అరుదైనదై, పవిత్ర గోదావరి నదీ తీరాన గుట్టపై వెలసి, సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ధర్మపురికి 11కిలో మీటర్ల దూరాన మంచిర్యాల జిల్లా సరిహద్దున దండేపెల్లి మండలం గూడెం వద్ద భక్తుల పాలిటి వరదునిగా వాసి కెక్కిన సర్వజన బాంధవుడైన గూడెం రమా సహిత సత్యనారాయణ స్వామి కార్తీక పౌర్ణమి జాతర వేడుకలు నవంబర్ 3 నుండి అత్యంత వైభవంగా జరుగ నున్నాయి. పూర్వము గూడెం గ్రామ వాస్తవ్యుడైన శ్రీ గోవర్ధన పెరుమాండ్ల స్వామి అనే చాత్తాద శ్రీ వైష్ణవునికి శ్రీ స్వామి, స్వప్న దర్శనం గావించి, మీగ్రామ శివారు రాట్నపు చెవులు కొండపై వెలిశాను అని చెప్పారట. అది స్వప్నమే కదా! అని విశ్వసించక మిన్నకుండి నాడట. కాని మరునాడు స్వప్నములో మళ్ళీ స్వామి రావడంతో... పెరుమాండ్ల స్వామి కొండ ఎక్కి, స్వామి వెలసిన చోటు కోసం వెతక నారంభించి తిరిగి తిరిగి ఎంత వెతికినా 'జాడ తెలియక పోవడంతో సాయంత్రం ఇంటి కేగి నిద్రకు ఉపక్రమించగా, నీవుండే జాడ తెలుసుకునేంత జ్ఞానము నాకెక్కడిది స్వామి? నన్ను మన్నించి దర్శనమివ్వు! అని మనసులో తలచుకొని నిద్రించడం జరిగింది. ఆ రాత్రి స్వప్నములో స్వామి అగుపించి ఆ కనపడుతున్న అదే రాట్నపు చెవుల కొండపై ఒక చిన్ననీటి కొలను (సారితే) దానికి దగ్గరగా ఉత్తర దిశలో ఉన్న గుహలో నేనున్నాను అని చెప్పి అదృశ్యమైనాడు. తెల్ల వారగానే ఆతృత పట్ట జాలక కొండపై వేగి కలలో అగుపించిన గుహలో వెదికితే, గుహలో చిన్న విగ్రహం దర్శన మిచ్చింది. విగ్రహన్ని వెంటనే పెరుమాళ్లు పరుగున వెళ్ళి గోదావరిలో శుచిగా స్నానమాచరించి పూజా ద్రవ్యాలతో కొండ చేరుకొని విగ్రహమున్నచోట శుభ్రపరచి స్వామివారికి అభిషేకాదులు, పూజలు జరిపి నైవేద్యం పెట్టగా, విషయం తెలుసుకున్న . గ్రామ ప్రజలు కొండను చేరుకొని స్వామి దర్శనం చేసుకున్నారు. దైవ ప్రభావము చేత వారి కోరికలన్నియు తీరాయట. ఇలా కొండ పై దేవుడు వెలిశాడన్న వార్త ఊరూరా పాకి అందరూ దర్శనానికి రావడం మొక్క డము భక్తుల కోర్కెలు తీరడము, పెరుమాండ్లు ప్రతి రోజు స్వామి వారికి పూజాధికాలు, నిర్వహించడము ద్వారా స్వామి మహత్యము తొందరలో అందరికి తెలిసి పోవడము జరిగింది. రోజులు గడిచిన కొలది శ్రీ పెరుమాండ్లు స్వామి ఆలోచించి శ్రీ సత్యనారాయణ స్వామి, రమాదేవి విగ్రహాలు పెద్దవి చేయించి భక్తుల సహకారముతో ఆలయ నిర్మాణము గావించి శ్రీ క్రోధి నామ సంవత్సర మాఘ శుద్ధ దశమి (1964) లో విగ్రహ ప్రతిష్ట చేశారు. కొండ పైకి వెళ్ళుటకై దారి, మంచి నీటి బావి త్రవ్వించారు. నాటి నుండి అసంఖ్యాక భక్తుల కోర్కెలు తీర్చుతూ శ్రీ స్వామి వారు నిత్య వినూత్న కళలతో వెలుగొందు చున్నాడు. ఈ దేవాలయము తెలంగాణలో ఎంతో ప్రసిద్ధి గాంచిన ఏకైక శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయము. కొండకు దాదాపు 1.కి.మీ. దూరాన పరమ పవిత్రమైన గోదావరి నది ప్రవహిస్తున్నది. భక్తులు అందు స్నానమాచరించి శ్రీ స్వామి వారిని దర్శించుకొనుట పరిపాటి. ఈ దేవస్థానములో ఎక్కువ సంఖ్యలో శ్రీ స్వామి వారి వ్రతమును చేసుకుంటారు. కుంకుమార్చనలు, అష్టోత్తరము లు, అభిషేకము, హారతులు, ఇత్యాది అర్చనలు చేయించు కొని భక్తులు భగవదనుగ్రహ పాత్రులు అవుతున్నారు. గోదావరి తీరాన ఒక గుట్టపై సత్యనారాయణ స్వామి, అదే ప్రాంతంలో పక్కన ఎత్తైన ప్రదేశంలో అయ్యప్ప స్వామి వెలసి, తెలంగాణలో అపర అన్నవరంగా, మరో శబరిమలైగా పెరిన్నకగన్న గూడెం గుట్ట విశేష ప్రాధాన్యత కలిగి ఉంది. కార్తీక పౌర్ణమి జాతర నిర్వహణకై దేవస్థానం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు, అర్చకులు, కార్యనిర్వహ ణాధికారి సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమాల నిర్వహణకై తగు ఏర్పాట్లు గావిస్తున్నారు. మారహిత శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 5న కార్తీక పౌర్ణమి రోజున నిత్య హవనం, బలిహరణం, మహా పూర్ణాహుతి, యజ్ఞ పరి సమా ప్తి, మహదాశీర్వచనం, తీర్థ ప్రసాదాల వితరణ తదితర ఉత్స వ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యం లో మంచిర్యాల, కరీంనగర్, జగిత్యాల ఆర్టీసీ వారు ప్రత్యేకంగా బస్సులు నడప నున్నారని ఈఓ శ్రీనివాస్ సంకటాల వివరించారు.

# భారత పుత్రికలు చరిత్ర సృష్టించారు

**న్యూఢిల్లీ :** న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌ని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ప్రారంభించారు. ప్రైవేట్ రంగంలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించేలా వాతావరణం కల్పించేందుకు రూ.లక్ష కోట్ల నిధిని ఉపయోగించనున్నట్లు ప్రధాని తెలిపారు. ఈ సందర్భంగా ఐసీసీ వన్డే వరల్డ్ కప్ సాధించిన భారత జట్టును, బాహుబలి రాకెట్‌ను విజయవంతంగా నింగిలోకి పంపిన భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోను ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమం సైన్స్‌కు సంబంధించిందని.. కానీ తొలుత క్రికెట్‌లో భారత్ సాధించిన అద్భుతమైన విజయం గురించి మాట్లాడుతున్నా నన్నారు. భారత మొత్తం తమ జట్టు సాధించిన విషయంతో సంతోషంగా ఉందని.. మహిళల జట్టు తొలి ప్రపంచకప్‌ని సాధించిందని.. ఇందుకు తాను మహిళా జట్టును హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాన్నారు. విజయాన్ని చూసి గర్విస్తు న్నానని.. ఈ విజయం దేశంలోని కోట్లాది మంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.ఆ తర్వాత భారీ ఉపగ్రహాన్ని అత్యంత బరువైన ఉపగ్రహాన్ని ప్రయోగించినం దుకు ఇస్రోను అభినందించారు. నిన్న భారత్ శాస్త్ర సాంకేతిక రంగంలో జెండా ఎగుర వేసిందని.. శాస్త్రవేత్తలు అత్యంత బరువైన కమ్యూనికేషన్ శాటిలైట్‌ను విజయవంతంగా ప్రయోగిం చారన్నారు. ఈ మిషన్, ఇస్రోతో సంబంధం ఉ?న శాస్త్రవేత్తలందరినీ తాను అభినందిస్తున్నానన్నారు. రూ.లక్ష కోట్ల నిధి ప్రైవేట్‌రంగంలో పరిశోధనలను ప్రోత్సహిస్తుం దన్నారు. ఈ రోజు శాస్త్ర సాంకేతిక ప్రపంచంలో కూడా గొప్పరోజని.. 21వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు కలిసి కొత్తతరం శాస్త్ర సాంకేతిక రంగాలకు మార్గదర్శకత్వం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిశోధన అభివృద్ధి ఆవిష్కరణ పథకాన్ని ప్రారంభించామని.. దానికి రూ.లక్ష కోట్ల నిధిని కేటాయించామన్నారు.‘రూ.లక్ష కోట్లు మోదీ వద్దే ఉంటుందని మీరు అనుకోవచ్చు. అందుకే మీరు చప్పట్లు కొట్టడం లేదు. ఈ లక్ష కోట్లు మీ కోసం (శాస్త్రవేత్తలు). ఇది మీ సామర్థ్యాలను పెంపొందించడానికి. ఇది మీ కోసం కొత్త అవకాశాలను తెరవడానికి. ప్రైవేట్ రంగంలో కూడా పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించడమే మా ప్రయత్నం’ అని పేర్కొన్నారు. భారతదేశం హై రిస్క్, అధిక ప్రభావ పరిశోధన ప్రాజెక్టులకు మద్దతు ఇస్తోందని ప్రధాని తెలిపారు. ఈ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను సైన్స్ అండ్ టెక్నాలజీకి శక్తి కేంద్రంగా ఎదగడానికి ప్రోత్సహిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో ఆధునిక ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి తమ ప్రభుత్వం గణనీయమైన సంస్కరణలను చేపట్టిందన్నారు.ఒక దశాబ్దంలో పరిశోధన వ్యయం రెట్టింపు అయ్యిందని.. మా ప్రభుత్వం ఆర్థిక నియంత్రణ, సముపార్జన విధానంలో గణనీయమైన సంస్కరణలు చేసిందని చెప్పారు.ఇది భారత్ ఆవిష్కరణ పట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, వృద్ధి-అభివృద్ధికి కొత్త అవకాశాలను సృష్టించడానికి ప్రభుత్వం అనుసంధాన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించిందని తెలిపారు. దశాబ్దం కిందట భారత్‌లో మహిళలు దాఖలు చేసే పేటెంట్ల సంఖ్య ఏటా వంద కంటే తక్కువగా ఉండేదని.. ప్రస్తుతం ఈ సంఖ్య 5వేలకు పెరిగిందన్నారు. భారత్‌లో ౹ుఇఓ విద్యను అభ్యసిస్తున్న వారిలో 43శాతం మంది మహిళలు ఉన్నారని.. ఇది ప్రపంచ సగటు కంటే చాలా ఎక్కువ అని ప్రధాని వివరించారు.



**దేశ మహిళల్లో ఆత్మవిశ్వాసానికి చిహ్నం**

క్రికెట్‌లో భారత పుత్రికలు చరిత్ర సృష్టించారని ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తంచేశారు. ఈ విజయం దేశ మహిళల్లో ఆత్మవిశ్వాసానికి చిహ్నమని అభివర్ణించారు. భారత మహిళా జట్టు తొలిసారి వన్డే ప్రపంచకప్ విజేతగా నిల వడంపై ఈ విధంగా స్పందించారు. బిహార్‌లోని సహర్సాలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడు తూ.. ఎన్డీయే అంటే వికాసమని, మహాగట్ బంధన్ అంటే వినాశనమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో మరోసారి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడేలా తొలిసారి ఓటువేసే వారు తమ హక్కును వినియోగించుకోవాలని కోరారు. “నేను విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు అక్కడి నేతలకు మఖానా బాక్స్‌లను కానుకగా అందజేశాను. ఇది బిహార్ కార్మికుల శ్రమకు నిదర్శనమని చెప్పాను. అలాగే కోసి నది వరదల ప్రభావాన్ని తగ్గించేలా శాశ్వత పరిష్కారం కోసం మేం కృషి చేస్తున్నాం” అని మోదీ అన్నారు. ఆర్జేడీ ‘జంగల్ రాజ్’లో పోలీసులు కూడా సురక్షితంగా లేరని, చట్టాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకున్న డీఎస్పీ సత్యపాల్‌సింగ్‌ను హత్య చేశారని విమర్శించారు.

## ట్రక్ బీభత్సం..







**జైపూర్:** రాజస్థాన్‌లో మరో ఘోర ప్రమాదం జరిగింది. సోమవారం రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ప్రయాణిస్తున్న వాహనాలపై డంపర్ ట్రక్ దూసుకెళ్లింది. ఐదుకిలోమీటర్ల మేర వాహనాలను ఢీకొట్టుకుంటూ వెళ్లింది. ఈ ప్రమాదంలో 19 మందికి పైగా మృతి చెందారు. యాభై మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. 17కు పైగా వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. జైపూర్ నగరంలోని హర్మదా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ డంపర్ ట్రక్ బీభత్సం సృష్టించింది. అతి వేగంతో వచ్చిన డంపర్ ట్రక్ ముందుగా ఓ కారును ఢీకొట్టింది. ఆ తర్వాత పల్టీ కొడుతూ మరో రెండు వాహనాలపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కార్లు, బైకులు, పాదచారులు అన్నీ డంపర్ ట్రక్ కిందపడి నుజ్జునుజ్జ య్యాయి. అయినప్పటికీ ట్రక్ డ్రైవర్ వాహనం ఆపకుండా ముందుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంతో అప్రమత్తమైన స్థానికులు క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాద సమయంలో డంపర్ డ్రైవర్ మద్యం సేవించినట్లు సమాచారం. ఐదు కిలోమీటర్ల మేర అతను వాహనాలను ఢీకొంటూ ముందుకు సాగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ‘డంపర్ ట్రక్ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడు. రోడ్డుమీద వాహనాల్ని ఢీకొట్టుకుంటూ వెళ్లాడు. వాహనాలు ప్రమాదానికి గురవుతున్నా ఆపకుండా ముందుకు వెళ్లాడని ’ వారు పేర్కొన్నారు.

**పోలీసుల దర్యాప్తు**

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. డంపర్ డ్రైవర్ మద్యం సేవించాడా? లేక వాహనంలో బ్రేక్ ఫెయిల్యూర్ జరిగిందా? అనే కోణాల్లో పూర్తి స్థాయిలో దర్యాప్తు ప్రారంభించారు.

## రూ.3వేల కోట్లు కొల్లగొట్టారు



**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఇటీవలి కాలంలో పెచ్చుమీరుతున్న ‘డిజిటల్ అరెస్టు’ మోసాలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొంది. డిజిటల్ అరెస్టు స్కామ్‌లపై కొద్దిరోజులుగా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. “ఒక్క మనదేశంలోనే ఈ అరెస్టు బాధితుల నుంచి రూ.3వేల కోట్లు కొల్లగొట్టడం దిగ్భ్రాంతికరం. ఇప్పుడు వీటిని మనం తీవ్రంగా తీసుకోకపోతే.. ఈ నేరగాళ్లు పెచ్చుమీరిపోతారు. వీటికి అడ్డుకట్టవేసేలా కఠినచర్యలు తీసుకోవాలని నిశ్చయించుకున్నాం” అని సుప్రీంకోర్టు పేర్కొంది. “డిజిటల్ అరెస్ట్ సమస్య పెద్దస వాల్‌గా ఉంది. ఇతర దేశాల్లో ఎలాంటి పరిస్థితి ఉందో తెలియదు. సాంకేతిక, ఆర్థిక విభాగాలు ఎలా పనిచేస్తున్నాయో తెలియదు. ఆ విభాగాలు మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది” అని హెచ్చరించింది. ఇలాంటి కేసుల్లో బాధితులు ఎక్కువగా వయోధికులే ఉండటం అత్యంత దయనీయమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయస్థానానికి వెల్లడించారు. అలాగే ఈ కేసుల్లో ఫిర్యాదులపై దర్యాప్తు చేసేందుకు కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక యూనిట్ ఉందని తెలిపిన మెహతా.. ఈ వ్యవహారంలో సమగ్ర దర్యాప్తు వివరాలు దాఖలు చేసేందుకు సమయం కావాలని కోరారు. ఈ మోసాలు దేశవ్యాప్తంగా చోటుచేసుకుం టున్న నేపథ్యంలో మొత్తం వ్యవహారంపై దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని యోచిస్తున్నట్లు గత విచారణలో సుప్రీంకోర్టు పేర్కొంది. దేశవ్యాప్తంగా విభిన్న రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లను కలిపి విస్తృతస్థాయిలో దర్యాప్తు జరిపే సాంకేతిక, సిబ్బందిపరమైన వనరులు సీబీఐకి ఉన్నాయా? అని కూడా ఆరా తీసింది. ఇందుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమాధానం ఇస్తూ ఇప్పటికే సీబీఐ ఇలాంటి మోసాలపై దర్యాప్తు చేస్తోందని చెప్పారు. కేంద్రహోంశాఖ పరిధిలోని సైబర్ క్రైమ్ డివిజన్ నుంచి ఇందుకు అవసరమైన సాంకేతిక సాయం అందుతున్నట్లు వివరించారు.

## ‘కూటమిలో పప్పు, తప్పు, అప్పు’: సీఎం యోగి



**దర్భంగా:** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇండియా కూటమిపై తీవ్ర విమర్శలు చేశారు. సోమవారం బీహార్ లోని దర్భంగాలో జరిగిన బహిరంగ ర్యాలీలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్, ఆర్జేడీల పనితీరును దుయ్యబట్టారు. వారి పాలనలో రాష్ట్రంలో ఏమి జరిగిందో గుర్తు చేశారు. ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమిపై విమర్శల బాణాన్ని ఎక్కుపెట్టిన సీఎం యోగి.. వారి గత పాలనలో పేదలకు ప్రాథమిక అవసరాలు, సంక్షేమ ప్రయోజనాలు అందకుండా పోయాయని ఆరోపించారు. 2005కి ముందు కాంగ్రెస్, ఆర్జేడీ పాలనలో రాష్ట్రంలోని పేదలు అనారోగ్యానికి గురైతే, వైద్య సదుపాయాలు లేక బాధపడుతూ చనిపోయేవారని అన్నారు. మహాత్మాగాంధీ చెప్పిన మూడు కోతులు కథను గుర్తు చేస్తూ, నేడు ఇండియా కూటమిలో పప్పు, తప్పు, అప్పు అనే మూడు కొత్త కోతులు ఉన్నాయన్నారు. వాటి గుణాలను వివరిస్తూ పప్పు నిజం మాట్లాడలేదని, తప్పు సరైనది చూడలేదని, అప్పు నిజం వినలేదని అ?న్నారు. ఈ నేతలు ఎన్‌డీఏ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులను చూడలేరు, వినలేరు, మాట్లాడలేరని, అందుకే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని యోగి ఆరోపించారు. కశ్మీర్‌ను కాంగ్రెస్ వివాదాస్పదం చేసిందని, అయితే ప్రధాని మోదీ దానిని ఉగ్రవాదం నుండి విముక్తి చేశారని సీఎం యోగి పేర్కొన్నారు. హిందువులు కశ్మీర్‌ను విడిచి వెళ్లాల్సి రావడం వెనుక కాంగ్రెస్ తప్పిదముందని, ఇప్పుడు మిథిల, బీహార్ ప్రజలు కూడా అక్కడ ప్రశాంతంగా జీవించగలుగుతున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలు రామునికి వ్యతిరేకం అని, హిందూ విశ్వాసాన్ని అగౌరవపరుస్తున్నాయని సీఎం ఆరోపించారు.

రామ రథయాత్రను ఆపేందుకు ఆర్జేడీ ప్రయత్నించిందని, అయోధ్యలో రామ భక్తులపై కాల్పులు జరపాలని సమాజ్ వాదీ పార్టీ ఆదేశించిందని, పవిత్ర నగరాన్ని రక్తంతో ఎర్రగా మార్చారని యోగి ఆరోపించారు. ఆర్జేడీ పాలనలో బీహార్‌లో 70కి పైగా మారణహోమాలు జరిగాయన్నారు. ఈ పార్టీలు ప్రజలను కులాల వారీగా విభజించి, జాతీయ భద్రతను బలహీనపరుస్తున్నాయని ఆరోపించారు.

# పరిస్థితి దిగజారినప్పుడు కాదు..
# ముందుగానే సిద్ధం కావాలి

ఢిల్లీ-నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా అఫిడవిట్ దాఖలు చేయాలని కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ని ఆదేశించింది. కాలుష్యాన్ని అరికట్టేందుకు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారని కమిషన్‌ను ప్రశ్నించింది. పరిస్థితి మరింత దిగజారినప్పుడు మాత్రమే అధికారులు చర్యలు తీసుకోకూడదని.. అంతకు ముందు సిద్ధం కావాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. విచారణ సందర్భంగా కోర్టుకు అమికస్ క్యూరీగా సహాయం చేస్తున్న సీనియర్ న్యాయవాది అపరాజిత సింగ్ దీపావళి తర్వాత ఢిల్లీలోని అనేక వాయు నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలు పని చేయడం లేదంటూ కోర్టుకు తెలిపారు.

37 స్టేషన్లలో తొమ్మిది మాత్రమే నిరంతరాయంగా పని చేస్తున్నాయని.. ఈ కేంద్రాలు సరిగా పని చేయకపోతే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ ను ఎప్పుడు అమలు చేయాలో నిర్ణయించడం కష్టమవుతుందని అపరాజిత సింగ్ తెలిపారు. పరిస్థితి క్లిష్ట స్థాయికి చేరుకోకుండా నిరోధానికి కమిషన్ ఏం చర్యలు తీసుకుందో చెప్పాలని.. ఇప్పటికే తీసుకున్న, ప్రతిపాదిన చర్యలను వివరించే వివరణాత్మక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని కమిషన్‌ను ఆదేశించింది. ఏజెన్సీలు ‘ప్రతిస్పందించడానికి బదులు’గా.. ‘ముందుగానే సిద్ధం’ కావాలని స్పష్టం చేసింది. కాలుష్య డేటాను పర్యవేక్షించే బాధ్యత కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డుదేనని కమిషన్ తరఫున న్యాయవాది వాదనలు వినిపించారు. అన్ని ఏజెన్సీలు త్వరలో తమ నివేదికలను సమర్పిస్తాయని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు హామీ ఇచ్చారు. కాలుష్యం పెరిగినప్పుడు ఏజెన్సీలు చర్యలు తీసుకోవడమే కాకుండా.. దాన్ని నివారించడానికి సకాలంలో చర్యలు తీసుకోవాలని గతంలో ఆదేశించినట్లుగా కోర్టు గుర్తు చేసింది. అయితే, అక్టోబర్ 15న దీపావళి సందర్భంగా ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో పరిమిత స్థాయిలో గ్రీన్ క్రాకర్స్ అమ్మకాలు, వినియోగానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. సాంప్రదాయ ఉత్సవాలు, పర్యావరణ సమస్యల మధ్య సమతుల్యత అవసరమని కోర్టు పేర్కొంది. గ్రీన్ క్రాకర్స్ అక్టోబర్ 18 నుంచి 20 మధ్య మాత్రమే విక్రయించవచ్చని.. నిర్దిష్ట సమయాల్లో మాత్రమే కాల్చేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మినహాయింపును టెస్ట్ కేసు ప్రాతిపదికన ఇస్తున్నట్లు కోర్టు పేర్కొంది. అలాగే, అక్టోబర్ 14 నుంచి 25 వరకు గాలి నాణ్యతను పర్యవేక్షించి.. రోజువారీ నివేదికలను సమర్పిం చాలని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డులను కోర్టు ఆదేశించింది.



# అనవసర అంశాలపైనే ప్రసంగాలు’

దేశాన్ని, బిహార్‌ను అవమానించారంటూ ప్రతిపక్ష నేతలందరిపై ప్రధాని నరేంద్ర మోదీ ముద్ర వేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ విమర్శించారు. దీనికోసం కేంద్రంలో కొత్తగా ‘అవమానాల మంత్రిత్వశాఖ’ను ఏర్పాటు చేయాలంటూ ఎద్దేవా చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోన్‌బర్సాలో నిర్వహించిన ప్రచార సభలో ఈమేరకు ప్రసంగించారు. ప్రధాని అనవసర విషయాలన్నీ మాట్లాడుతున్నారని, కానీ.. రాష్ట్రంలో ఎన్డీయే సర్కారు అవినీతి, దుష్పరిపాలనపై మాత్రం నోరు మెదపడం లేదన్నారు. “అభివృద్ధి గురించి మాట్లాడటా నికి బదులుగా.. ప్రతిపక్ష నేతలు దేశాన్ని, బిహార్‌ను అవమానిస్తున్నారంటూ ప్రధాని మోదీ పదేపదే ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారాలపైనే ఎక్కువ దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. కాబట్టి.. దీని కోసం నూతనంగా ‘అవమానాల శాఖ’ను ఏర్పాటు చేయాలి” అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో రాష్ట్రానికి వరాలు ప్రకటించే ముందు.. గత 20 ఏళ్లలో ఎన్డీయే సర్కారు ఏం చేసిందో మోదీ, అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిహార్ ప్రభుత్వాన్ని నీతీశ్ కుమార్ నడపడం లేదని.. ప్రధాని, ఇతర వ్యక్తులు దిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా నియంత్రిస్తున్నారని ప్రియాంక పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును లాక్కొనేందుకు చూస్తున్నారని ఆరోపించారు. స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతోనే యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోందన్నారు. ఉపాధి కల్పించే ప్రభుత్వ రంగ సంస్థలను భాజపా సన్నిహిత కార్పొరేట్‌లకు అప్పగించారని ఆరోపిం చారు. ఇదిలా ఉండగా.. ఛత్ పూజ, మహా కుంభమేళాలను ప్రతిపక్ష నేతలు అవమానించారంటూ ప్రధాని మోదీ ఆదివారం ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రియాంక గాంధీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



# ఎస్ఎల్‌బీసీ టన్నెల్ విషయంలో రాజకీయం తగదు

-మొదటిపేజీ తరువాయి

ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడే నాటికి 30 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణం పూర్తయిందని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న తొమ్మిదన్నరేళ్లలో 10 కిలోమీటర్ల టన్నెల్ కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. పెద్దగా కమీషన్లు రావని ఈ టన్నెల్‌ను పక్కకు పెట్టారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడును విస్తరిస్తుంటే కేసీఆర్ అప్పుడు చూస్తూ ఊరుకున్నారని ఆరోపించారు. రెండు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఉంటే ఉమ్మడి నల్గొండ జిల్లాకు నీరు అందేదని చెప్పారు. కృష్ణానది మీద చెపట్టిన అన్ని ప్రాజెక్టులను కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు.
బీఆర్ఎస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు రూ. 1.86 లక్షల కోట్లు చెల్లించారని, ఆ మొత్తంలో కాళేశ్వరం ప్రాజెక్టుకే రూ. 1.06 లక్షల కోట్లు చెల్లించారని రేవంత్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత గత పదేళ్లలో ఏపీ ప్రభుత్వం కృష్ణా నదిపై ప్రాజెక్టులు నిర్మిస్తే, కేసీఆర్ మాత్రం ఏమీ నిర్మించలేకపోయారని మండిపడ్డారు.

### కమిషన్లు రావని ఎస్ఎల్ బిసి టన్నెల్ ప్రాజెక్టును పక్కకు పెట్టారు

ఎస్ఎల్ బిసి టన్నెల్ పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎస్ఎల్ బిసి టన్నెల్ పనుల పురోగతిని పరిశీలించామని అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా మన్నేవారి పల్లిలో సిఎం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రాజెక్టు మంజూరు చేసినప్పుడు టన్నెల్ పనుల అంచనా విలువ రూ. 1968 కోట్లు అని అన్నారు. రెండు దశాబ్దాలుగా సాగుతున్న టన్నెల్ పనుల్లో ఎన్నో అవాంతరాలు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి 30 కిలో మీటర్ల టన్నెల్ నిర్మాణం పూర్తయ్యిందని, మాజీ సిఎం కెసిఆర్ ప్రభుత్వం పదేళ్లలో మిగతా 10 కి.మి. టన్నెల్ పూర్తి చేయలేదని, ఎస్ఎల్ బిసి టన్నెల్ ప్రాజెక్టుల్లో పెద్దగా కమిషన్లు రావని ఈ ప్రాజెక్టు ను పక్కకు పెట్టారని విమర్శించారు. ఎపిలో మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పోతిరెడ్డి పాడును విస్తరిస్తుంటే కెసిఆర్ చూస్తూ ఊరుకున్నారని రేవంత్ మండిపడ్డారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే.. కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతో పట్టించుకోలేదని, కృష్ణా నది పేరు మీద చేపట్టిన అన్ని ప్రాజెక్టులను కెసిఆర్ నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. గత పదేళ్లలో సాగునీటి ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు కెసిఆర్ ప్రభుత్వం రూ. 1.86 లక్షల కోట్లు చెల్లించిందని, రూ.



1.86 లక్షల కోట్లలో కాళేశ్వరం కాంట్రక్టర్లకే రూ. 1.06 లక్షల కోట్లు చెల్లించారని తెలియజేశారు. గత పదేళ్లలో ఎపి ప్రభుత్వం కృష్ణా నదిపై ఎన్నో ప్రాజెక్టులు చేపట్టి పూర్తి చేసిందని, తెలంగాణలో మాత్రం కెసిఆర్ ప్రభుత్వం కృష్ణానదిపై ప్రాజెక్టులు పూర్తి చేయలేదని అన్నారు. టన్నెల్ బోర్ మిషన్ తో మిగతా పనులు చేయటం కష్టంగా మారిందని, ఎస్ఎల్ బిసి టన్నెల్ పనులపై బిఆర్ఎస్ నాయకులు రాజకీయం చేయడం తగదు అని హెచ్చరించారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా.. ఎస్ఎల్ బిసి టన్నెల్ పనులు పూర్తి చేసి తీరుతామని సవాల్ విసిరారు. ఈ ప్రాజెక్టు పూర్తి కాకపోతే.. మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాలకు తీవ్ర నష్టం జరుగుతుందని, ఆర్మీలో నిపుణులైన అధికారులను డిప్యుటేషన్ పై తీసుకువచ్చామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులు హెలిబోర్న్ ఏరియల్ సర్వేను పరిశీలించిన సీఎం రేవంత్

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ ప్రాజెక్టు టన్నెల్ పనులు కొనసాగించడానికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్తల నేతృత్వంలో హెలిబోర్న్ ఏరియల్ ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ సర్వే కార్యక్రమం ప్రారంభమైంది. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, , కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట మండలం మన్నెవారిపల్లికి చేరుకున్న ముఖ్యమంత్రి సమీపంలోని ఎస్ఎల్బీసీ టన్నెల్ -1 (ఔట్ లెట్ సీ- పాయింట్) వద్ద హెలిబోర్న్ ఏరియల్ ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ సర్వే కోసం హెలికాప్టర్లో ఏర్పాటు చేసిన అత్యంత అధునాతన ట్రాన్స్మిటర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశీలించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా భుగర్భ స్థితిగతులను తెలుసుకునే అంశాలను ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు వివరించారు. ఎస్ఎల్బీసీ పనులను కొనసాగించడానికి టన్నెల్ ప్రాంతంలో 800-1000 మీటర్ల లోతులో షియర్ జోన్ (రాతి) అలాగే నీటి ప్రవాహాలు, వాటి తీవ్రతను గుర్తించడానికి ఈ సర్వేను ఉపయోగపడుతుంది. సర్వే చేపట్టే విధానంపై శాస్త్రవేత్తలు వివరించిన అనంతరం ముఖ్యమంత్రి సర్వే నిర్వహణకు హెలికాప్టర్ టేక్ఆఫ్ కోసం అనుమతించారు. ఆ హెలికాప్టర్ వెంట ముఖ్యమంత్రి, మంత్రులతో కలిసి మరో హెలికాప్టర్లో కొంత దూరం ప్రయాణించి లోలెవల్లో జరిగే ఎక్సర్సైజ్ను పరిశీలించారు. సర్వే చేసే ప్రాంతం, సర్వే కోసం ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, ఇతర అంశాలపై ఎన్జీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ కుమార్, శాస్త్రవేత్త డాక్టర్ హెచ్వీఎస్ సత్యనారాయణ, నీటి పారుదల శాఖ సలహాదారు, భారత సైనిక అధికారి పరీక్షిత్ వివరించారు. కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు చిక్కుడు వంశీకృష్ణ, , నేనావత్ బాలు నాయక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చేవెళ్లలో ఘోర ప్రమాదం

-మొదటిపేజీ తరువాయి

కింద ఊపిరాడక చనిపోయారు. కొందరు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.నడుము లోతు వరకు కంకర రాళ్లు కప్పేయడంతో బస్సు నుంచి బయటకు రాలేక ప్రయాణికులు నరకయాతన అనుభవించారు.జేసీబీల సాయంతో బస్సులో చిక్కుకున్న వారిని కొందర్ని కాపాడి చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను సైతం బస్సు నుంచి వెలికితీశారు.ఈ ప్రమాదంలో మొత్తం 21 మంది మృతిచెందగా, మరికొందరు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.తాండూరు నుంచి హైదరాబాద్ వెళున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన లారీ, బస్సుపై బోల్తా పడింది. లారీలోని కంకర మొత్తం ప్రయాణికులపై పడటంతో చాలామంది దాని కింద చిక్కుకుపోయారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 70 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ఆదివారం సెలవు కావడంతో ఇళ్లకు వెళ్లి, తిరిగి హైదరాబాద్‌లోని కార్యాలయాలు, కళాశాలలకు వెళ్తున్న వారే వీరిలో అధికంగా ఉన్నారు. ప్రయాణికుల ఆర్తనాదాలతో ప్రమాద స్థలం హృదయవిదారకంగా మారింది.మృతుల్లో బస్సు డ్రైవర్ దస్తగిరి, లారీ డ్రైవర్ సహా 12 మంది మహిళలు, ఒక చిన్నారి ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మూడు జేసీబీల సహాయంతో కంకరను తొలగించి, అందులో చిక్కుకున్న వారిని బయటకు తీస్తున్నారు. ఇప్పటివరకు కండక్టర్ రాధ సహా 15 మందిని సురక్షితంగా కాపాడారు. ఈ క్రమంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ కూడా గాయపడ్డారు.క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్షతగాత్రులకు అత్యున్నత వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితుల కోసం గాంధీ ఆసుపత్రిలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. మృతులందరి పోస్టుమార్టం ఉస్మానియా ఆసుపత్రిలో ఒకేచోట నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రమాదం కారణంగా హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది.కేంద్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు పరిహారం ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.2 లక్షలు పరిహారం అందిస్తామని ప్రకటించింది.ఢీకొట్టిన తరువాత కంకర లోడుతో ఉన్న లారీ బస్సు మీద ఒరగడంతో ప్రాణ నష్టం అధికంగా సంభవించినట్లు తెలుస్తోంది. రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు ఈ ఘటనపైగ్రాఢ్భాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### మృతులు వీరే

మృతుల వివరాలు..
దస్తగిరి బాబా, బస్సు డ్రైవర్ బచ్చన్ నాగమణి (55), భానూరు తారిబాయ్ (45), దన్నారమ్ తండా కల్పన (45), బోరబండ మల్లగండ్ల హనుమంతు, దౌల్తాబాద్ ఏమావత్ తాలీబామ్, దన్నారమ్ తండా షేక్ ఖలీద్ హుస్సేన్, తాండూరు తబస్సుమ్ జహాన్, తాండూరు గుర్రాల అభిత (21), యాలాల్ గోగుల గుణమ్మ, బోరబండ బుచ్చిబాబు-దన్నారమ్ తండా అబ్దుల్ రజాక్-హైదరాబాద్ శ్రీను- తాండూరు నందిని- తాండూరు ప్రేరణ- వికారాబాద్ అక్రమ్-తాండూరు అస్లామ్-తాండూరు వెంకటయ్య వెన్నెల సుజాత అశోక్ రవి సాయి బస్వరాజ్- కోకట్ (కర్ణాటక)

### మృతదేహాలకు ఒకేచోట పోస్టుమార్టం

బస్సు ప్రమాద మృతులందరికీ ఒకే చోట పోస్టుమార్టం నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉస్మానియా ఆస్పత్రికి ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాలను తరలిస్తున్నారు. ఉస్మానియా ఆస్పత్రి బృందంతోపాటు, గాంధీ ఫోరెన్సిక్ టీం డాక్టర్లు సైతం పోస్టుమార్టంలో పాల్గొనాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. గాంధీ ఆస్పత్రి డాక్టర్లు, ఫోరెన్సిక్ నిపులు ఉస్మానియాకు వెళున్నారు. గాయపడిన వారికి చికిత్స అందించేందుకు గాంధీ ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసినట్లు డాక్టర్ల బృందం తెలిపింది.రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్‌గ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంపై ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన ఆయన ఆర్టీసీ అధికారులు ఘటనాస్థలికి వెళ్లాలని ఆదేశించారు. ప్రమాదం ఎలా జరిగిందని ఫోన్లో అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ రాంగ్‌రూట్‌లో వచ్చి ఆర్టీసీ బస్సును ఢీకోట్టడంతో ప్రమాదం జరిగి, తీవ్ర విషాదం నెలకొందని అధికారులు చెప్పారని తెలిపారు.

### చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితులకు పరామర్శ

తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, కాంగ్రెస్ ఇంచార్జి భీం భరత్ తదితరులు రోడ్డు ప్రమాదం స్థలాన్ని పరిశీలించారు. చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. గాయపడిన వారిని పరామర్శించి, మెరుగైన వైద్య అందిస్తామని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.
బస్సు తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా కంకర లోడు లారీ వికారాబాద్ వె?పు వెళ్తుంది. అతివేగంగా దూసుకొచ్చి రాంగ్ రూటులో వచ్చి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. కంకర లోడ్ మీద పడటంతో ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులు మృతిచెందారు. కొందరు ఊపిరాడక ఆర్తనాదాలు చేసి ప్రాణాలొదిలారు. దాంతో ప్రమాదం జరిగిన స్థలంలో భయానక వాతావరణం కనిపించింది.

### యాదయ్యకు చేదు అనుభవం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యకు బస్సు ప్రమాద స్థలిలో చేదు అనుభవం ఎదురైంది. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి 163పై రంగారెడ్డి జిల్లా మీర్జాగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఆర్టీసీ బస్సుపై కంకర లోడుతో వెళుతున్న లారీ పడిపోవడంతో 19 మంది ప్రయాణీకులు మరణించగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు.ఈ ప్రాంతానికి కాలే యాదయ్య రాగా, ప్రయాణికులు 'ఎమ్మెల్యే డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేస్తూ, ఆయనపై దాడికి యత్నించారు. వారి నిరసనతో ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు.ఈ ప్రమాదం చాలా బాధాకరమని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రహదారి మంజూరై ఆరేడు సంవత్సరాలు అవుతోందని తెలిపారు. ఈ రోడ్డు చాలా చిన్నగా ఉందని, ఈ ప్రాంతంలో ఎన్నోమార్లు ప్రమాదాలు జరిగాయని అన్నారు. రోడ్డు సన్నగా ఉండటం వల్ల వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్జీటీలో కేసుల వేసిన కారణంగా రోడ్డు వెడల్పు ఆలస్యమవుతోందని అన్నారు.టిప్పర్ వేగంగా వచ్చి ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిందని తాండూరు బస్ డిపో మేనేజర్ తెలిపారు. ఉదయం 7.05 గంటలకు ప్రమాదం జరిగిందని, టిప్పర్‌లో సుమార్ 50 టన్నుల కంకర ఉన్నట్లు వెల్లడించారు. గుంతను తప్పించబోయి టిప్పర్ బస్సును ఢీకొన్నట్లు తెలిసిందని తెలిపారు.

### ముగ్గురు అక్కా చెల్లెళ్లు మృతి

రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని ఒక కుటుంబాన్ని అంతులేని విషాదంలో ముంచింది. ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు సహా మొత్తం 19 మంది చనిపోగా, వారిలోఒక కుటుంబంలోనే ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృతిచెందారు. ఘటనా స్థలంలో తల్లి గుండెలు బాదుకుని ఏడుస్తుంటే చూసేవారికి సైతం కన్నీళ్లు వచ్చాయి.తాండూరులోని గాంధీనగర్‌కు చెందిన ఎల్లయ్య గౌడ్ ముగ్గురు కుమార్తెలు ఈ దుర్ఘటనలో మరణించారు. ఒకే ఇంట్లోని ముగ్గురు అక్కాచెల్లెళ్లు తనూష, సాయి ప్రియ, నందిని చనిపోవడంతో ఆ కుటుంబంలో అంతులేని విషాదం నెలకొంది. వారి బాధను ఎవరూ తగ్గించలేరు. ఆ తల్లి కడుపుకోతకు ఎవరు సమాధానం చెబుతారు. అమ్మను వచ్చాను లేచి చూడండమ్మా అంటూ ఆ తల్లి రోదన అక్కడున్న వారిని కదిలించింది.తాండూరు గాంధీనగర్ కు చెందిన ఎల్లయ్య గౌడ్ ముగ్గురు కుమార్తెలు హైదరాబాద్‌లోని కోఠి మహిళా కళాశాలలో చదువుతున్నారు. తనూష (ఎంబీఏ), సాయిప్రియ (డిగ్రీ థర్డ్ ఇయర్), నందిని (డిగ్రీ ఫస్టియర్) చదువుతున్నారు. ఇటీవల బంధువుల పెళ్లి ఉండటంతో సొంతూరు తాండూరుకు వచ్చారు. సోమవారం తెల్లవారుజామున తిరిగి హైదరాబాద్ వెళ్తుండగా బస్సు ప్రమాదంలో అక్కాచెల్లెళ్లు ముగ్గురు చనిపోయారు. ఆర్టీసీ బస్సు ప్రమాదం సమాచారం అందిన వెంటనే తల్లిదండ్రులతో పాటు బంధువులు ఘటనాస్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.ఎల్లయ్య గౌడ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. తన నలుగురు కుమార్తెలను కష్టపడి చదివించారు. పెద్ద కుమార్తెకు వివాహం చేయగా.. మిగిలిన ముగ్గురు కుమార్తెల్ని హైదరాబాద్‌లో చదివిస్తున్నారు. కానీ నేడు జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తూ ముగ్గురు కూతుళ్లు మృతిచెందడంతో, ఆ కుటుంబం, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన అఖిలరెడ్డి అనే యువతి కూడా ఈ ప్రమాదంలో చనిపోయారు. అఖిలరెడ్డి ఎంబీఏ చదువుతోంది. ప్రమాదం గురించి తెలుసుకుని అఖిల తల్లి, బంధువులు అక్కడికి వెళ్లారు. కుమార్తె మృతితో అఖిల తల్లి కన్నీటిపర్యంతమయ్యారు.

## రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు

-మొదటిపేజీ తరువాయి

ఫిట్‌నెస్ ఉన్నప్పటికీ ఇరుకు రోడ్డు, డివైడర్ లేకపోవడంతో ప్రమాదం జరిగిందని తెలిపారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఈ ఘటనలో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని చెప్పుకొచ్చారు. వాహనాల స్పీడ్ లాక్ ఎంత వరకు అమలవుతున్నాయో అధికారులు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. వాహనాల స్పీడ్ లాక్ బ్రేక్ చేస్తే ట్రిపుల్ పెనాల్టీ వేయాలని ఆదేశించారు. రవాణా శాఖ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీరియస్‌గా ఉండాలని ఆజ్ఞాపించారు. చేవెళ్ల, తదితర ఘటనలు జరిగినప్పుడు అధికారులు తనిఖీలు చేయడమే కాదని నిరంతరం యాక్షన్ ప్లాన్ ఉండేలా కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. రవాణా శాఖపై ఉన్న గౌరవాన్ని ప్రజల్లో, ప్రభుత్వంలో పెంపొందించేలా ఉద్యోగులు పని చేయాలని మార్గనిర్దేశం చేశారు. అందరూ జాగ్రత్తగా పని చేయాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు మంత్రి పొన్నం ప్రభాకర్.
రవాణా శాఖ అధికారులు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రతి జిల్లాలో కఠినంగా వ్యవహరిస్తేనే రోడ్డు ప్రమాదాలను కంట్రోల్ చేయొచ్చని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు వేధింపులు లేకుండా రవాణా శాఖ నిబంధనల ప్రకారం వ్యవహరించాలని ఆదేశించారు. రవాణా శాఖలో కొత్తగా వచ్చిన ఉద్యోగులకు సీనియర్లు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. టిప్పర్ లారీలు ఇసుక, డస్ట్ తీసుకెళ్లేటప్పుడు టార్పలిన్ కప్పుకొని తీసుకెళ్లాలని ఆదేశించారు. డీటీసీ, ఆర్టీవోలు ఇతర రవాణా శాఖ అధికారులు ఒక్కో జిల్లాలో మూడు బృందాలుగా ఏర్పాటు చేసుకొని నిరంతరం పర్యవేక్షణ చేయాలని మార్గనిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ధ్యానం తరలింపునకు ఉపయోగించే వాహనాలపై వేధింపులకి గురిచేయొద్దని సూచించారు మంత్రి పొన్నం ప్రభాకర్. కమర్షియల్ వాహనాలు, ప్రయాణికులను తరలించే వాహనాలు, మైన్స్ మినరల్స్ తరలించే వాహనాల్లో నిబంధనలు పాటించని వాహనాల్లో భారీ పెనాల్టీతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని ఆజ్ఞాపించారు. నిబంధనలు పాటించని స్లీపర్ బస్సులు అందులో కార్గో సరుకులు తరలించిన కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. స్కూల్ బస్ ఫిట్‌నెస్, హైర్ బస్ ఫిట్‌నెస్, ట్రక్కులు, టిప్పర్లు, లారీలు వాటి ఫిట్‌నెస్, పర్మిట్‌లపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని హుకుం జారీ చేశారు. వచ్చే రోడ్ సేఫ్టీ మంత్ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయంలో ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని.. దాని కన్నా ముందు ప్లాన్ ఆఫ్ యాక్షన్ అమలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు.

## పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిబంధనలు మార్చండి

**హైదరాబాద్:** పత్తి కొనుగోళ్లలో సీసీఐ విధించిన నిబంధనలు మార్చాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయాలన్న సీసీఐ కొత్త నిబంధన నేపథ్యంలో కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తాకు లేఖ రాశారు. సాధారణంగా ఇప్పటి వరకు ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తుండగా.. ఎకరాకు 11.74 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ల నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం డిక్లరేషన్ ఇచ్చిందని ఆ లేఖలో ప్రస్తావించారు. "ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పత్తి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో సీసీఐ తీసుకొచ్చిన కొత్త నిబంధన పత్తి రైతులకు నష్టం చేసేలా ఉంది. తేమ శాతం విషయంలో 20శాతం వరకు ఉన్నా సరే పత్తి పంట సీసీఐ కొనుగోలు చేయాలి. కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన లేకపోవడం వల్ల కూడా పత్తి రైతులకు ఇబ్బందులు తలెత్తాయి. రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని 7 క్వింటాళ్ల నిబంధన ఎత్తి వేసి పాత పద్ధతిలో పత్తి కొనుగోళ్లు చేయాలి. జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలి"అని మంత్రి తుమ్మల కేంద్రానికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

## పత్తి రైతులను తేమ పేరిట మోసం చేస్తున్నారు



-మొదటిపేజీ తరువాయి

అమ్ముకుంటున్నారని చెప్పారు. ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీలు ఉండి కూడా రైతులకు ప్రయోజనం లేకుండా పోయిందని ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్రచారం ఆపేసి రైతుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. తేమతో సంబంధం లేకుండా గిట్టుబాటు ధరకు సీసీఐ పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కవిత జాగృతి జనం బాట కార్యక్రమం ఆదిలాబాద్‌కు చేరుకుంది. షెడ్యూల్ ప్రకారం ఇవాళ ఆమె ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈ మేరకు కవితకు సంప్రదాయ వాయిద్యాలు, గుస్సాడీ నృత్యాలతో ఆదివాసీలు, తెలంగాణ జాగృతి నాయకులు ఘన స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలో ఆదివాసీల ఆరాధ్య దైవం కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె ఆదివాసీల, రైతుల సమస్యలపై మాట్లాడారు.

## విద్యాసంస్థలు బంద్.. సర్కార్ ప్లానేంటి?



**హైదరాబాద్:** తెలంగాణలో నేటి నుంచి ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థలు నిరవధిక బంద్‌ను పాటించనున్నాయి. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, బీఈడీ తదితర వృత్తి విద్యా కళాశాలలు, డిగ్రీ కళాశాలలు బంద్‌కు ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య పిలుపునిచ్చింది. దీంతో, కాలేజీలు మూతపడనున్నాయి. రాష్ట్రంలో పదివేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థలు బంద్‌కు పిలుపునిచ్చాయి. అయితే, దీపావళి నాటికి ప్రభుత్వం 600 కోట్లు ఇస్తామని భరోసా ఇచ్చినప్పటికీ ప్రభుత్వ హామీ నిలబెట్టుకోలేకపోవడంతో ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థలు ఆందోళన బాట పట్టాయి. కాలేజీలు నడపలేకపోతున్నామని ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య ఆవేదన వ్యక్తం చేసింది. కాగా, ప్రభుత్వం చర్చలకు పిలిస్తే వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించింది. ఇదే సమయంలో తక్షణమే బకాయిల్లో 50 శాతం చెల్లించాలని డిమాండ్ చేసింది. అయితే, బంద్ ప్రకటన నేపథ్యంలో ప్రభుత్వం 1200 కోట్లకు టోకెన్లు ఇచ్చి కేవలం 300 కోట్లు అందించినట్టు సమాచారం.

# బరువు తగ్గడానికి ఏది బెస్ట్?



అరటిపండ్లు ఆరోగ్యానికి ఎంతో మంచివి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. చలికాలంలో బరువు తగ్గడానికి అరటి కాయ తినాలా..? అరటిపండా..? ఈ రెండింటి మధ్య ఉన్న తేడాలు, ఆరోగ్య ప్రయోజనాలు గురించి తెలుసా..? శీతాకాలంలో ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఈ సీజన్‌లో ఆహారపు అలవాట్లు, జీవనశైలి మారడం వలన అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ చలికాలంలో లభించే పండ్లలో అరటిపండు చాలా రుచికరమైనది, అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. అయితే అరటి కాయ తినాలా..? అరటిపండు తినాలా అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. పండిన అరటిపండ్లు ఎప్పుడూ మంచి రుచిని, తక్షణ శక్తిని అందిస్తాయి. పండిన అరటిపండ్లలో చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది వాటిని అద్భుతమైన శక్తి వనరుగా మారుస్తుంది. ఇవి అధిక గ్లైసెమిక్ సూచిక కలిగి ఉంటాయి. దీని అర్థం ఇవి శక్తిని త్వరగా విడుదల చేస్తాయి. పండిన అరటిపండ్లు సులభంగా జీర్ణమవుతాయి. కాబట్టి ఇవి పిల్లలకు, అథ్లెట్లకు తక్షణ శక్తిని అందించడానికి ఉత్తమ ఎంపిక.పచ్చి అరటిపండ్లు పండిన వాటి కంటే భిన్నమైన, ప్రత్యేకమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. పచ్చి అరటిపండ్లలో రెసిస్టెంట్ స్టార్చ్ అనే ఒక రకమైన కార్బోహైడ్రేట్ ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థలో నెమ్మదిగా కదులుతూ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. వీటిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. మధుమేహం ఉన్నవారు లేదా ఇన్సులిన్ నిరోధకత సమస్య ఉన్నవారికి పచ్చి అరటిపండ్లు చాలా మంచివి. లక్ష్యం బరువు తగ్గడం అయితే పచ్చి అరటిపండు మీకు ఉత్తమంగా సహాయపడుతుంది. పచ్చి అరటిపండ్లలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉంటుంది. అధిక ఫైబర్ కారణంగా, ఇది ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతుంది. దీనివల్ల తరచుగా ఆకలి వేయకుండా ఉంటుంది. అతిగా తినడాన్ని నియంత్రించడం ద్వారా బరువు నియంత్రణలో ఉంచుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రెండు రకాల అరటిపండ్లు వాటి ప్రయోజనాలను కలిగి ఉంటాయి. తక్షణ శక్తి కావాలంటే పండిన అరటిపండు. జీర్ణక్రియ, రక్తంలో చక్కెర నియంత్రణ లేదా బరువు తగ్గడం కోసం అయితే పచ్చి అరటిపండు తినడం బెస్ట్. మీ వ్యక్తిగత ఆరోగ్య అవసరాలు, లక్ష్యాల ఆధారంగా సరైన అరటిపండును ఎంచుకోవచ్చు.

# మునగకాయ నీరు లాభాలు...

మునగ.. ఇది బహుళార్ధసాధక చెట్టు. దీని ఆకులు, పువ్వులు, కాయలను ఆహారం కోసం, వివిధ ఔషధ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారు. మునగకాయలు ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరమైన అనేక పోషకాలను కలిగి ఉంటాయి. మునగ నీరు కూడా ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు కలిగి ఉన్నాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మునగకాయ నీళ్లు అనేక రకాల వ్యాధులను తగ్గించడంలో సహాయపడుతుందని వివరిస్తున్నారు. మునగకాయలు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. వీటిని తినడం వల్ల అనేక వ్యాధులను నివారించవచ్చు. మునగకాయలలో ప్రోటీన్, విటమిన్లు ఎ, సి, బి కాంప్లెక్స్, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికి చాలా మేలు చేస్తాయి. మునగకాయ నీరు మిమ్మల్ని వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడటమే కాకుండా మీ మొత్తం ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. మునగకాయ ఆకు అయినా, బెరడు అయినా, లేదా మునగకాయ కాయ అయినా, మునగకాయ అన్ని భాగాలు ఆరోగ్య ప్రయోజనాలతో నిండి ఉంటాయి. మునగకాయ నీరు తాగడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి చాలా మందికి తెలియదు. మునగ కాయ వాటర్ శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు శరీరానికి బ్యాక్టీరియా, వైరస్లతో పోరాడే శక్తిని ఇస్తాయి. దీన్ని క్రమం తప్పకుండా తాగడం వల్ల కాలానుగుణ వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షించుకోవచ్చు.మునగ కాయలు ఫైబర్, ఆయుర్వేద లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తాయి. దీని నీరు పేగు వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. జీర్ణక్రియ నిర్వహించబడుతుంది. కడుపు తేలికగా అనిపిస్తుంది. మునగ కాయ వాటర్ జీవక్రియను వేగవంతం చేస్తుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇది ఆకలిని నియంత్రిస్తుంది. అదనపు కొవ్వును తగ్గిస్తుంది. ఉదయం ఖాళీ కడుపుతో దీన్ని తాగడం వల్ల బరువు తగ్గడం వేగవంతం అవుతుంది. మునగ కాయ వాటర్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. దీని లక్షణాలు ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతాయి. డయాబెటిస్‌ను నియంత్రించడంలో సహాయపడతాయి. ప్రతిరోజూ దీనిని తాగడం డయాబెటిక్ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. మునగకాయ నీటిలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మెరిసే చర్మాన్ని, బలమైన జుట్టును ప్రోత్సహిస్తాయి. ఇది చర్మం నుండి విషాన్ని బయటకు పంపి జుట్టు మూలాలను పోషిస్తుంది. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మీ చర్మాన్ని ప్రకాశవంతం చేస్తుంది. మీ జుట్టుకు మెరుపు వస్తుంది. మునగకాయ నీటిని ఎలా తయారు చేయాలి? 3-4 తాజా మునగకాయలు, 2-3 గ్లాసుల నీటిని తీసుకోవాలి. ముందుగా మునగ కాయలను ముక్కలుగా కట్ చేసుకోవాలి. వాటిని నీటిలో వేసి 10-15 నిమిషాలు తక్కువ మంట మీద మరిగించాలి. నీటిని వడకట్టి తీసుకోవాలి. ఈ నీటిని ఉదయం ఖాళీ కడుపుతో లేదా పగటిపూట కూడా తాగొచ్చు. ఈ మునగ కాయ వాటర్ అనేది మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడే సహజమైన, సరళమైన నివారణ. దీనిని తీసుకోవడం వల్ల అనారోగ్యాన్ని నివారించడమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని కూడా ప్రోత్సహిస్తుంది.




# చెరకు, చెరకు రసం.. ఆరోగ్యానికి ఏది బెటర్

చెరకు.. దీనిని కేవలం తీపి కోసం మాత్రమే కాదు.. హిందూ పండుగలలో దేవుడికి నైవేద్యంగానూ ఉపయోగిస్తారు. రుచిలో తియ్యగా ఉండి ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు అందించే ఈ చెరకు.. తక్షణ శక్తిని ఇవ్వడం, జీర్ణక్రియను మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడంలో అద్భుతంగా పనిచేస్తుంది. తక్షణ శక్తికి చెరకు రసం: చెరకు, దాని రసం రెండూ శరీరానికి త్వరగా శక్తిని అందించేవే.. చెరకును నమిలినప్పుడు, శరీరానికి గ్లూకోజ్ నెమ్మదిగా విడుదలవుతుంది. ఇది దీర్ఘకాలిక శక్తిని అందిస్తుంది. చెరకు రసం తాగడం ద్వారా గ్లూకోజ్ వెంటనే రక్తంలో కలిసి తక్షణ శక్తిని ఇస్తుంది. ముఖ్యంగా అలసటగా ఉన్నప్పుడు లేదా వ్యాయామం తర్వాత చెరకు రసం తాగడం చాలా ఉపయోగకరం.జీర్ణక్రియకు ఫైబర్ బలం: జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడంలో చెరకు ముఖ్యపాత్ర పోషిస్తుంది. చెరకును నమిలేటప్పుడు అందులోని ఫైబర్ జీర్ణక్రియను నెమ్మదిస్తుంది. దీని ద్వారా జీర్ణవ్యవస్థ బలంగా మారుతుంది. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మలబద్ధకం, ఇతర కడుపు సమస్యలు తగ్గుతాయి. చెరకు రసం కూడా జీర్ణక్రియకు మేలు చేస్తుంది. కానీ నమలడంతో పోలిస్తే రసంలో ఫైబర్ తక్కువగా ఉండటం వల్ల దాని ప్రభావం కొంచెం తక్కువగా ఉంటుంది. దంతాలు, చిగుళ్లకు బలం: ఆశ్చర్యకరంగా.. చెరకు నమలడం వల్ల దంతాలు శుభ్రపడతాయి. చిగుళ్ళు కూడా బలంగా తయారవుతాయి. ఇందులో ఎముకలను బలోపేతం చేసే కాల్షియం, పాస్పరస్ వంటి ముఖ్యమైన మినరల్స్ ఉంటాయి. చెరకు నమలడం దంత ఆరోగ్యానికి దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తుంది.



**ఇమ్యూనిటీ - డీటాక్స్:** చెరకు, చెరకు రసం రెండూ రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు శరీరం బ్యాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్లతో పోరాడేందుకు శక్తినిస్తాయి. చెరకు రసంలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఖనిజాలు కాలేయాన్ని శుభ్రపరచడానికి సహాయపడతాయి. తక్షణ డీటాక్స్ ఫలితాల కోసం రసం తాగడం మంచిది. నమలాలా..? తాగాలా..?: చెరకును నమలడం, రసం తాగడం రెండూ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మీరు మీ శక్తిని క్రమంగా పెంచుకోవాలని, కడుపు సమస్యల నుంచి రిలీఫ్, దంతాలు, చిగుళ్లను పటిష్టం చేసుకోవాలని అనుకుంటే చెరకును నమిలి తినడం ఉత్తమం. మీకు తక్షణ శక్తి కావాలన్నా, శరీరం డీటాక్స్ జరగాలన్నా లేదా వేసవిలో వెంటనే చల్లదనం కావాలన్నా చెరకు రసం తాగడం మరింత ప్రభావవంతంగా ఉంటుంది.

# చందమామలాంటి అందం కావాలా?



ఖర్జూరాల్లో ఇతర పండ్ల కంటే ఎక్కువ కేలరీలు ఉంటాయి. అందుకే రోజూ రెండు ఖర్జూరాలు తినడం వల్ల కడుపు శుభ్రపడుతుంది. మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఖర్జూరాలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. అవి పేగుల నుంచి విషపూరిత అంశాలను తొలగించడంలో సహాయపడతాయి. ఖర్జూరం రుచికి తీపిగా ఉండటమేకాకుండా ఇందులో పోషకాలు కూడా దండిగా ఉంటాయి. ఇందులో అనేక పోషక లక్షణాలు ఉన్నాయి. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అన్ని వయసుల వారికి ఖర్జూరం మేలు చేస్తుంది. అయితే ఇందులో ఇతర పండ్ల కంటే ఎక్కువ కేలరీలు ఉంటాయి. అందుకే రోజూ రెండు ఖర్జూరాలు తినడం వల్ల కడుపు శుభ్రపడుతుంది. మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఖర్జూరాలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. అవి పేగుల నుంచి విషపూరిత అంశాలను తొలగించడంలో సహాయపడతాయి. ఇది నిర్విషీకరణకు సహాయపడుతుంది. ఖర్జూరాల్లో ఇతర పండ్ల కంటే ఎక్కువ యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. వీటిలోని ఫ్లేవనాయిడ్లు వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు డయాబెటిస్, అల్జీమర్స్, క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఇది వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. ఫినోలిక్ ఆమ్లాల శోథ నిరోధక లక్షణాల కారణంగా ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఖర్జూరాలు తీపిగా ఉంటాయి. ఇందులో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ ఇవి మధుమేహ వ్యాధిగ్రస్తులకు సురక్షితం. వీటిలో తక్కువ గ్లైసెమిక్ సూచిక ఉంటుంది. అందువల్ల అవి రక్తంలో చక్కెర పెరగడానికి అనుమతించవు. అయితే పరిమితంగా మాత్రమే వీటిని తీసుకోవాలి. ఖర్జూరంలో ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇది ఎముకలను బలంగా చేస్తుంది. ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యల నుంచి కూడా రక్షిస్తుంది. ఖర్జూరంలో రాగి, మాంగనీస్, సెలీనియం వంటి ఖనిజాలు ఉంటాయి. ఇవి ఎముకల నిర్మాణానికి సహాయపడతాయి. ఖర్జూరాలు ఫైటోహార్మోన్లకు మంచి మూలం. ఇది చర్మం వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తుంది. ఖర్జూరాలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ముడతలు తగ్గుతాయి.చర్మం మరింత సాగేలా చేస్తుంది.

# ప్రోటీన్ కోసం వెజిటేరియన్ ఫుడ్స్

వెజిటేరియన్స్‌కి పోషకాలు అందవు అంటారు. కానీ, పోషకాలు కేవలం నాన్‌వెజ్‌లో మాత్రమే ఉండదండి. మన చుట్టూ ఉండే కొన్ని వెజిటేరియన్ ఫుడ్స్‌లో కూడా పుష్కలమైన ప్రోటీన్ ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల కండరాల బలం పెరగడం దగ్గర్నుంచీ కడుపు నిండిన బరువు ఉంటుంది. బరువు తగ్గడానికి హెల్ప్ అవుతుంది. ఎక్కువగా ప్రాసెస్ చేయని ఫుడ్స్ ఇలాంటి ఫుడ్స్‌ని తింటే మీరు ఉపవాసం ఉంటే మధ్యమధ్యలో ఆకలి ఉండదు. పైగా ఆరోగ్యానికి చాలా మంచిది. మరి అలాంటి ప్రోటీన్ రిచ్ వెజిటేరియన్ ఫుడ్స్ ఏంటో తెలుసుకోండి. మనలో చాలామందికి ఈ విషయం గురించి తెలియకుండానే పప్పులు తింటున్నాం. అదేంటంటే, పప్పుల్లో పుష్కలంగా ప్రోటీన్ ఉంటుంది. ఇందులో ఫైర్ కూడా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల పెద్ద ప్రేగుల్లోని మంచి బ్యాక్టీరియాకి హెల్ప్ చేస్తుంది. పప్పు ధాన్యాలు తింటే గుండె సమస్యలు, షుగర్, అధిక బరువు, క్యాన్సర్స్ వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. దీనికి కారణం ఇందులోని ఫోలేట్, మాంగనీస్, ఐరన్, యాంటీ ఆక్సిడెంట్స్ వంటి ఎన్నో పోషకాలు. కిడ్నీ బీన్స్‌లో కూడా పుష్కలంగా ప్రోటీన్ ఉంటుంది. శనగల దగ్గర్నుంచీ, రకరకాల బీన్స్‌లు కూడా ప్రోటీన్ రిచ్ ఫుడ్స్. ఇందులో సంక్లిష్ట కార్బోహైడ్రేట్స్ ఉంటాయి. వీటితో పాటు ఫైబర్, ఐరన్, ఫోలేట్, పాస్ఫరస్, పొటాషియం, మాంగనీస్ వంటి గుణాలు ఉన్నాయి. వీటిని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గడమే కాకుండా రక్తంలో చక్కెర తగ్గుతుంది. బీపి తగ్గుతుంది. బెల్లీ ఫ్యాట్ తగ్గుతుంది. వీటిని రెగ్యులర్‌గా కాకుండా కాస్తా మసాలా వండుకుని తింటే నాన్‌వెజ్ కంటే ఎంతో రుచిగా ఉంటాయి. పచ్చి బఠానీలు ఇందులోనూ పుష్కలంగా ప్రోటీన్ ఉంటుంది. ఓ కప్పు పచ్చి బఠానీల్లో దాదాపు 9 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. వీటితో పాటు ఫైబర్, థయామిన్, ఫోలేట్, మాంగనీస్, విటమిన్, కెలతో పాటు ఐరన్, మెగ్నీషియం, పాస్ఫరస్, జింక్, కాపర్, ఇతర బి విటమిన్స్ ఉంటాయి. వీటిని మనం ఎలా అయినా వండుకోవచ్చు. ఏంచక్కా వీటితో స్నాక్స్ కూడా చేసుకుని తినొచ్చు. ఉడికించి కాస్తా పోపు వేసుకుని తింటే బ్రేక్‌ఫాస్ట్ లంచ్ ఎప్పుడైనా చాలా బాగుంటుంది. నట్స్, సీడ్స్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇందులో ప్రోటీన్ పోషకాలు ఉంటాయి. బాదం ఓ ఔన్స్ పరిమాణంలో దాదాపు 6 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. వీటితో పాటు ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, సెలీనియం, పాస్ఫరస్, విటమిన్ ఈ, కొన్ని బి విటమిన్స్‌తో పాటు ఫైబర్, హెల్దీ ఫ్యాట్స్ కూడా ఉంటాయి. వీటితో పాటు యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. వీటిని నానబెట్టుకుని తింటే మంచిది. అలా కాకుండా వాటిని నూనెలో వేయించి తింటే పోషకాలు తగ్గుతాయని గుర్తుంచుకోండి. వీటిని స్నాక్స్‌లా, స్వీట్స్‌లో ఎలా అయినా చేసుకుని తినొచ్చు. అన్నీ స్పెషల్ ఫుడ్స్ గురించి చెబుతున్నారు. మరీ రెగ్యులర్‌గా తినే కూరగాయల్లో ప్రోటీన్ ఉండదా అంటే అందులోనూ ఉంటాయి. బ్రకోలీ, పాలకూర, బంగాళాదుంపలు, చిలగడదుంపలు, బ్రస్సెల్ స్ప్రౌట్స్‌లో ప్రోటీన్ ఉంటుంది. ఇక పండ్లలో జామ, మల్బరీస్, బ్లాక్ బెర్రీస్, అరటిపండ్లలో కూడా ప్రోటీన్ ఉంటుంది. కాబట్టి, హ్యాపీగా తినేయొచ్చు.



# ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**

**జగిత్యాల :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.సోమవారంజగిత్యాల జిల్లా కేంద్రంలోని మాత శిశు ఆసుపత్రి ని జగిత్యాల ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగాఆస్పత్రిలోని ఆక్సిజన్ ప్లాంట్ ను సందర్శించి అందుబాటు లో ఉన్న పడకలు,ఆక్సీజన్, డ్రగ్స్,స్టాఫ్ హాజరు రిజిస్టర్ ను ఎమ్మెల్యే పరిశీలించి ఆసుపత్రిలో మందుల సంబంధిత వివరాలు తెలుసుకొని వైద్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ కొత్త ఆక్సీజన్ ప్లాంట్ ఏర్పాటు చేయటం జరిగిందని ఆక్సిజన్ ఉపయోగించడం,డ్రగ్స్ విషయంలో కొంత నిధులు అవసరం ఉందని ఎమ్మెల్యే దృష్టికి రాగా మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో మాట్లాడడం జరిగిందని స్పందించిన మంత్రి విషయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు కృషి చేస్తానని అన్నారు.ఆసుపత్రి స్టాఫ్ హాజరు రిజిస్టర్ పరిశీలించి ఆసుపత్రిని తనిఖీ చేయటం జరిగిందని, ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. మాతా శిశు ఆసుపత్రిలో చుట్టూ పక్కన 4 జిల్లాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తుందని ఆసుపత్రిని విస్తరించే విధంగా 200 కోట్ల తో 230 పడకల ఆసుపత్రి రావడం జరిగిందని టెండర్ ప్రక్రియ కూడా పూర్తి అయిందని




అధికారులు తెలిపారని ఎమ్మెల్యే అన్నారు.క్రిటికల్ కేర్ యూనిట్ కూడా పూర్తి అయిందని త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్. సునీల్, సూపరిండెంట్ డాక్టర్.కృష్ణమూర్తి, ఆర్ఎంవోలు డా. సుమన్ మోహన్ రావు, డా.గీతిక, డా.నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం నేతలు**

**జగిత్యాల :** రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలుగా ఇవ్వవలసిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ప్రస్తుత సంవత్సరంతో కలిసి పదివేల కోట్లకు చేరిందని,ఈ విషయం పై గత రెండు సంవత్సరాలుగా ప్రస్తుత ప్రభుత్వానికి ఎన్నిసార్లు మనవి చేసిన కనీస స్పందన లేదని,ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం నేతలు డిమాండ్ చేశారు.. సోమవారం జగిత్యాల జిల్లా డిగ్రీ కళాశాల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాద రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలుగా ఇవ్వవలసిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ప్రస్తుత సంవత్సరంతో కలిసి పదివేల కోట్లకు చేరిందని,ఈవిషయం పై గత రెండు సంవత్సరాలుగా ప్రస్తుత ప్రభుత్వానికి ఎన్నిసార్లు మనవి చేసిన కనీస స్పందన లేని కారణంగా రాష్ట్రంలోని అన్ని ఉన్నత విద్యాసంస్థలు తప్పని పరిస్థితిలో నిరవధిక బందుకు వెళ్లినామని స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం యొక్క నిర్లక్ష్య ధోరణి ప్రణాళిక, ముందు చూపులేనితనం వల్ల ఈరోజు స్కాలర్షిప్ బకాయిలు 10,000 కోట్లకు చేరుకున్నాయని ఆరోపించారు.పేద మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం గతంలో ఇచ్చిన 1200 కోట్ల టోకెన్లు వెంటనే క్లియర్ చేయాలని, మిగతా బకాయిలకు ఒక స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వస్తే తాము కూడా ప్రభుత్వానికి సహకరిస్తామని,అంతవరకు బందు విరమించలేమని తెలిపారు.ఆనంతరం శాతవాహన యూనివర్సిటీ ప్రైవేటు కళాశాలల యాజమాన్య సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీపాద నరేష్ మాట్లాడుతూ మనం మంత చదువుకున్న నిరుద్యోగులమని స్వయం ఉపాధి పథకంలో భాగంగా కళాశాలలు నెలకొల్పి తాము ఉపాధి పొందుతూ తమతోపాటు పదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న కళాశాలాలని,



ఏవో కొన్ని కార్పోరేట్ కళాశాలలు కొంతమంది రాజకీయ నాయకుల కళాశాలల చూసి అందరూ అదే బాటలో ఉన్నారని ఆలోచించడం తప్పు అన్నారు.ప్రభుత్వం మాలాంటి నిరుద్యోగుల ఉపాధి అవకాశాలను దెబ్బతీయ వద్దని, నిజాయితీగా పని చేస్తున్న మాలాంటి వాళ్ళ జీవితాలను కాపాడాలని వెంటనే రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులు మానసికంగా దృఢంగా ఎదిగే వయసులో చదివే డిగ్రీ విద్యను నిర్లక్ష్యం చేయవద్దని పాఠశాల స్థాయిలో విద్యార్థి ఎలా చదివినా ఉన్నత విద్యలో కనుక మంచి విద్యను అభ్యసిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి వెళ్లే అవకాశాలు ఉంటాయని, అలాంటి విద్యను అందించే విద్యాశాఖను కూడా చూస్తున్న ముఖ్యమంత్రి చిన్న చూపు చూడడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు అడిగితే తమపై విజిలెన్స్ దాడులతో భయభ్రాంతులకు గురిచేస్తూ సమాజంలో మాపై చెడు అభిప్రాయం వచ్చే రకంగా ప్రవర్తించడం సరైనది కాదని తెలిపారు.మన జగిత్యాల జిల్లాకు సంబంధించిన సుమారు 50 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని, ఇప్పటికే గత 3 సంవత్సరాల నుండి సుమారు 10 కళాశాలలు ఆర్థిక ఇబ్బందులతో మూతబడి కేవలం 11 కళాశాలలు మాత్రమే మిగిలాయని వాటిని కాపడాలని విజ్ఞప్తి చేశారు.ఆనంతరం ధర్మపురి నవోదయ కళాశాల కరస్పాండెంట్ ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత కళాశాలలో రియంబర్స్మెంట్ నిధులు లేక మూతపడితే అక్కడ యువత చెడు మార్గాల వైపు వెళ్తున్నారని చెప్పారు.వాళ్లు ఉపాధి కోసం కూలీ పనులకు లేదా దుబాయ్ లాంటి దేశాలకు వలస వెళ్తున్నారని అలాంటి ప్రమాదం నుంచి యువతను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి కళాశాల కరస్పాండెంట్ మూర్తి, ఇతర యాజమాన్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం!

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వేములవాడ :** వేములవాడ, కోనరావుపేట మండలాల్లో మూడు సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం.రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం నిలుస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ అర్బన్ మండలం నాంపల్లిలోని లక్ష్మీ నరసింహ కాటన్ ఇండస్ట్రీస్, సంకేపల్లిలోని లక్ష్మీ ఇండస్ట్రీస్, కోనరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో శ్రీ కావేరి కాటన్ ఇండస్ట్రీస్ సీసీఐ కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడా రు. జిల్లాలోని పత్తి రైతులకు ఇబ్బందులు కలుగకుండా, మద్దతు ధర వచ్చేలా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో మాట్లాడడంతో స్థానికంగా సీసీఐ కొనుగోలు కొనసాగిస్తున్నారని స్పష్టం చేశారు.జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో ఐదు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, వేములవాడ పరిధిలో రెండు, కోనరావుపేట మండలంలో ఒకటి, ఇల్లంతకుంట మండలంలో రెండు ఉన్నా యని తెలిపారు. రైతులు తమ సమీపంలోని ఆయా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించి మద్దతు పొందాలని పిలుపు నిచ్చారు.పత్తి నాణ్యత ఆధారంగా క్వింటాలుకు రూ. 7689 నుంచి 8110 మద్దతు ధర ఉందని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని, వారి సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. 20 నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా రూ. లక్ష కోట్లకు పైగా రైతు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు వెచ్చించిందని వెల్లడించారు. 20 వేల కోట్లకు పైగా రుణమాఫీ రైతులకు చేసిందని తెలిపారు. సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాలకు అదనంగా రూపాయల 500 అందజేస్తుందని



వివరించారు. ఇప్పటికే జిల్లాలోని ఆయా మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు దాన్యం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు చేయాలని సూచించారు.ఈ ప్రాంత సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలోని కాలువల ఇతర పనులు పూర్తి చేసేందుకు దాదాపు 300 కోట్లు పైగా ప్రజా ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధికి సీఎం శంకుస్థాపన చేశారని, పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఈ ఏడాది 46 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారని, జిల్లాలో 5 లక్షలకు పైగా క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని తెలిపారు. కపాస్ కిసాన్, లో రైతులు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. సీసీఐ, మార్కెటింగ్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో రైతులకు వసతులు కల్పించాలని ఆదేశించారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్లు రొండి రాజు, కచ్చకాయల ఎల్లయ్య, వేములవాడ ఆర్డీవో రాధాభాయ్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రకాష్, సీసీఐ సీపీఓ రఘురామ్ తహసీల్దార్లు విజయ్ ప్రకాశ్ రావు, వరలక్ష్మీ, ఎంపీడీఓలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏం జరిగిందో అర్థం కాలేదు

**హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై బస్సు కండక్టర్ కన్నీళ్లు పెట్టుకున్నారు. మీర్జాగూడ వద్దకు బస్సు రాగానే ఏం జరుగుతుందో క్షణంపాటు అర్థం కాలేదని, కన్నుమూసి తెరిచేలోపు ఘోరం జరిగిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో 19 మంది మృతి చెందగా, పదుల సంఖ్యలో గాయపడిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్న కండక్టర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మీడియాతో మాట్లాడుతూ, బస్సులో పోలీసులు, ఉద్యోగులు సహా మొత్తం 72 మంది ప్రయాణికులు ఉన్నారని ఆయన తెలిపారు.హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి 163పై మీర్జాగూడ వద్ద ఈ రోజు ఉదయం తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును కంకర లోడుతో వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ధాటికి బస్సుపై కంకర లోడు పడిపోవడంతో పలువురు ప్రయాణికులు దాని కింద కూరుకుపోయారు.ఈ దుర్ఘటనలో వికారాబాద్ జిల్లా యాలాల మండలం హాజీపూర్‌కు చెందిన బందప్ప, లక్ష్మీ దంపతులు మృతి చెందారు. దీంతో వారి కుమార్తెలు భవాని, శివలీల అనాథలయ్యారు. తల్లిదండ్రుల మరణంతో ఆ చిన్నారులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండటంతో అక్కడున్న వారి హృదయాలు బరువెక్కాయి.

## అధిక వర్షాలతో దెబ్బతిన్న ప్రభుత్వ నిర్మాణాల శాశ్వత నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

**సిద్దిపేట :** జిల్లాలో అధిక వర్షాలతో దెబ్బతిన్న ప్రభుత్వ నిర్మాణాల శాశ్వత నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కె. హేమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ. జిల్లాలో కురిసిన అధిక వర్షానికి దెబ్బతిన్న పంచాయతీరాజ్ మరియు ఆర్ అండ్ బి లో లెవెల్ వంతెనలు, కల్వర్టులు, రోడ్ల శాశ్వత నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. అదేవిధంగా అధిక వర్షాలతో దెబ్బతిన్న ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, మున్సిపాలిటీలో వివిధ నిర్మాణాల మరమ్మత్తుల కొరకు ప్రతి పాదనలు సిద్ధం చేయాలని అన్నారు. ధాన్యం కోసిన వెంటనే నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి నిర్ణీత తేమశాతం వచ్చేవరకు కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుతున్నారని కానీ అకాల వర్షాలు సంభవించినప్పుడు ఆ ధాన్యం తడిసిపోవడం జరుగుతుంది. కాబట్టి రైతులు ధాన్యం కోసం వెంటనే కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రాకుండా నిర్ణీత తేమశాతం వచ్చేవరకు ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా వ్యవసాయ మరియు ఇతర అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, డిఆర్ఓ నాగరాజమ్మ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ భవ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల కేసు నవంబర్ 24కు విచారణ వాయిదా

**హైదరాబాద్ :** రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను స్టేట్ ఎలక్షన్ కమిషన్ సస్పెండ్ చేస్తూ అక్టోబర్ 9న ఉత్తర్వులు జారీ చేసి విషయం తెలిసిందే.అయితే, ఆ ఉత్తర్వులను సస్పెండ్ చేయడానికి సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఆ పిటిషన్‌పై మరోసారి విచారణ చేపట్టిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వంతో పాటు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. అయితే, వాదనల సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాది ఎన్నికల నిర్వహణపై బెంచ్?కు తమ అభిప్రాయం తెలిపేందుకు మరింత గడువు కావాలని కోరారు. మరోవైపు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా తెలిపింది. దీంతో కేసులో తదుపరి విచారణకు ధర్మాసనం ఈ నెల 24కు వాయిదా వేసింది.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి: కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ :** సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు లక్ష్మీ కిరణ్ రెవెన్యూ, అశ్విని తానాజీ వాకడే స్థానిక సంస్థలు, నగరపాలిక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబుతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 369 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ. పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలు, ఇళ్ల వివరాలు, చనిపోయిన జంతువుల వివరాలు ఎస్డీఆర్ఎఫ్ కింద నమోదు చేయాలని తహసీల్దార్లకు సూచించారు. దెబ్బతిన్న భవనాలు, ట్యాంకులు, రోడ్ల వివరాలు నమోదు చేయాలని పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, నీటిపారుదల శాఖ, మున్సిపల్ శాఖలను ఆదేశించారు.తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలన్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల ఆవరణలను శుభ్రం చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు.

## మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు

**తల్లిదండ్రులు వాహన యజమానులు బాధ్యులు**

**ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్**

**సిద్దిపేట :** ప్రజా రవాణా భద్రతను దృష్టిలో ఉంచుకుని,18 సంవత్సరాల లోపు మైనర్ వ్యక్తులు వాహనాలు నడపడం చట్టపరంగా నిషిద్ధమని ట్రాఫిక్ ఎసిపి సుమన్ కుమార్ అన్నారు. ఇటీవల చోటుచేసుకున్న అనేక ప్రమాదాల నేపథ్యంలో మైనర్ డ్రైవింగ్ పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.18 ఏళ్ల కంటే తక్కువ వయసు కలిగిన వ్యక్తి మోటార్ వాహనం నడపడం మైనర్ డ్రైవింగ్ గా పరిగణించ బడుతుంది. ఇలాంటి వ్యక్తులు చట్టప్రకారం లెర్నర్ లేదా పర్మనెంట్ డ్రైవింగ్ లైసెన్స్ పొందలేరు. మైనర్ డ్రైవింగ్ చేస్తే వాహన యజమాని లేదా తల్లిదండ్రి పై ఎఫ్ఆర్ఐ నమోదు చేస్తామన్నారు. లెర్నర్ లైసెన్స్ తో వాహనం నడిపేటప్పుడు, వాహనంపై ఎల్ బోర్డు స్పష్టంగా ఉండాలి. పక్కన పూర్తి లైసెన్స్ ఉన్న వ్యక్తి ఉండాలి. సెల్ ఫోన్ వినియోగం, ర్యాష్ డ్రైవింగ్, రైడింగ్ ట్రిపుల్ లాంటివి కఠినంగా నిషేధం. తల్లిదండ్రులు తమ పిల్లలను మోటార్ వాహనాలు నడపడానికి అనుమతించరాదు. చట్టం ఉల్లంఘిస్తే తల్లిదండ్రులపై నేరపూరిత చర్యలు తప్పవు. మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాల బాధ్యత పూర్తిగా యజమానులు మరియు తల్లిదండ్రులపైనే ఉంటుందని అయన అన్నారు.

## ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

**అర్జీదారుల సమస్యలపై వినతులు స్వీకరించిన కోరుట్ల ,మెట్ పల్లి ఆర్డీవోలు**

**ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య 46**

**జగిత్యాల :** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరుట్ల,మెట్ పల్లి ఆర్డీవోలు జివాకర్ రెడ్డి, శ్రీనివాస్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు,వినతులను కోరుట్ల,మెట్ పల్లి ఆర్డీవోలు జీవాకర్ రెడ్డి, శ్రీనివాస్ స్వీకరించారు. ఈ సందర్భంగా కోరుట్ల, మెట్ పల్లి ఆర్డీవోలు మాట్లాడుతూపలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాలనుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.కాగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 46 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వివిధ శాఖల అధికారులు, సంబంధిత అధికారులు, ఫిర్యాదుదారులు, తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

### మరోసారి షాకిచ్చిన బంగారం, వెండి ధరలు



మన ఇంట్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా బంగారం కొనుగోలు చేస్తుంటారు. ఇక అందులోనూ మన దేశంలో గోల్డ్‌కి మరింత పాపులారిటీ ఎక్కువ. ఇక ఈ మధ్య కాలంలో బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒకరోజు రేట్లు తగ్గి కాస్త ఊరటనిస్తుంటే మరో రోజు పెరిగి అమ్మో అనిపిస్తున్నాయి. అయితే గత కొన్ని రోజులుగా పెరుగుతూ వస్తున్న బంగారం ధరలు రెండు రోజుల నుంచి కాస్త తగ్గుముఖం పట్టాయి. దీంతో పసిడి ప్రియులు కాస్త ఊపిరి పీల్చుకునే లోపే మళ్లీ బంగారం ధరలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో నేడు బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. ఇక ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడలో నిన్న రూ.1,23,000 ఉన్న 24 క్యారెట్ల బంగారం ధర పై నేడు రూ.170 పెరిగి రూ. 1,23,170గా ఉంది. అలాగే నిన్న రూ.1,12,750 ఉన్న 22 క్యారెట్ల బంగారం ధర పై నేడు రూ.150 పెరిగి రూ.1,12,900 గా ఉంది. ఇక అటు వెండి ధర రూ.2000 పెరిగి కిలో రూ. 1,68,000గా ఉంది.

### విదేశీ మారకం నిల్వల్లో భారీ పతనం



భారతదేశ విదేశీ మారకం నిల్వల్లో భారీ తగ్గుదల చోటు చేసుకుంది. అక్టోబర్ 24తో ముగిసిన వారంలో ఏకంగా 6.9 బిలియన్ డాలర్లు తగ్గి 695.355 బిలియన్లకు చేరుకున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తెలిపింది. ఇది ఇంతక్రితం వారంలో నమోదైన 702.28 బిలియన్లతో పోల్చితే తగ్గుదలను సూచిస్తుందని వెల్లడించింది. ఫారెక్స్ నిల్వలలో ప్రధాన భాగం అయినా విదేశీ కరెన్సీ ఆస్తులు సమీక్షా వారంలో 3.862 బిలియన్ డాలర్లు తగ్గి 566.548 బిలియన్లకు పరిమితమయినట్టు ఆర్బీఐ తెలిపింది. ఈ ఆస్తులలో యూరో, యెన్, పౌండ్ వంటి కరెన్సీలు డాలర్‌తో పోలిస్తే విలువలో హెచ్చు తగ్గులు చెందడం ఈ తగ్గుదలకు కారణం. ఇటీవల డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడంతో ఈ విలువ తగ్గింది. అదే సమయంలో బంగారం నిల్వలు 3.01 బిలియన్లు తగ్గి 105.536 బిలియన్లకు చేరాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్) 58 మిలియన్లు తగ్గి 18.664 బిలియన్ డాలర్లకు తగ్గాయని వెల్లడించింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)లో భారతదేశ నిల్వలు 6 మిలియన్ డాలర్లు పెరిగి 4.608 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. భారత విదేశీ మారకం నిల్వలు తగ్గితే ప్రధానంగా రూపాయిపై ఒత్తిడి పెరగనుంది.

# మైక్రోసాఫ్ట్‌లో ఐటీ ఉద్యోగుల నియామకాలు షురూ

ఐటీ, టెక్ రంగంలో లేఆఫ్స్ కారణంగా గత కొన్ని నెలలుగా ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్న సంగతి తెలిసిందే. ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో చెప్పలేని పరిస్థితులు. కరోనా మహమ్మారి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కారణాలతో ప్రపంచ స్థాయి టెక్ దిగ్గజ సంస్థల్లో ఒకటైన మైక్రోసాఫ్ట్ సైతం భారీగానే ఉద్యోగులను తొలగించింది. ఆ కంపెనీలో కొత్తగా చేరాలంటో ఉద్యోగానికి గ్యారెంటీ లేదనే మాట స్థాయికి వచ్చింది. అయితే, ఇకపై అలా ఉండదు. ఐటీ, టెక్ రంగంలోని వారు ఎగిరి గంతేసే మాట చెప్పారు మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల . త్వరలోనే తమ కంపెనీ భారీగా నియామకాలు చేపట్టనుందని వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో దూసుకెళ్లడమే లక్ష్యంగా మైక్రోసాఫ్ట్ అతి త్వరలో నియామకాలు మొదలుపెడుతుందని ఆ సంస్థ సీఈఓ సత్య నాదెళ్ల అన్నారు. ఇన్నాళ్లు వివిధ విభాగాల్లో లేఆఫ్స్ చేపట్టిన ఈ కంపెనీ ఇప్పుడు ఏఐని దృష్టిలో పెట్టుకుని నియామకాలు ప్రారంభిస్తుండడం గమనార్హం. బీజీ2 పాడ్ కాస్ట్‌లో పాల్గొన్న సందర్భంగా ఈ విషయాన్ని వెల్లడించారు. భవిష్యత్తులో కంపెనీ విస్తరణ ఆటోమేషన్ ఆధారంగానే మరింత స్మార్ట్‌గా, వ్యూహాత్మకంగా ఉంటుందన్నారు. ప్రస్తుత మార్పులను గతంలో ఫ్యాక్స్‌ల నుంచి ఇ-మెయిల్స్, స్ప్రెడ్ షీట్లకు మారిన విప్లవంతో ఆయన పోల్చారు. 'మా కంపెనీలో ఉద్యోగుల సంఖ్య పెంచబోతున్నాం. అయితే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శకానికి ముందు ఉన్నట్లుగా మాత్రం ఉండదు.





అంటే వచ్చే నియామకాలు ఏఐ ప్రభావాన్ని పెంచనున్నాయే తప్పా ప్రస్తుతం ఉన్న మాదిరిగా యాంత్రికంగా మాత్రం ఉండదు' అని సత్య నాదెళ్ల వెల్లడించారు. ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్, గిట్ హబ్ ఏఐ కోడింగ్ హెల్పర్ వంటి యాక్సెస్ ఇస్తామన్నారు. ఏఐ సాయంతో మరింత వేగంగా పని చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆయన వెల్లడించారు. దాదాపు ఏడాది నుంచి మైక్రోసాఫ్ట్ కంపెనీ ఉద్యోగుల సంఖ్యలో మార్పులు లేవు. 2022 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఆ కంపెనీలో ఉద్యోగుల సంఖ్య ప్రతి సంవత్సరం 22 శాతం మేర పెరుగుతూ వచ్చింది.

## అక్టోబర్‌లో 13 శాతం పెరిగిన రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు

ప్రముఖ ద్విచక్రవాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ అక్టోబర్ నెలలో అమ్మకాల్లో సత్తా చాటింది. పండగ సీజన్ డిమాండ్, మార్కెట్‌లో సానుకూల సెంటిమెంట్ కారణంగా గతేడాది ఇదే నెలతో పోలిస్తే మొత్తం విక్రయాల్లో 13 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ ఏడాది అక్టోబర్‌లో 1,24,951 యూనిట్లను విక్రయించగా, గతేడాది ఇదే సమయంలో ఈ సంఖ్య 1,10,574 యూనిట్లుగా ఉంది. కంపెనీ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, దేశీయ అమ్మకాలు 15 శాతం పెరిగి 1,01,886 యూనిట్ల నుంచి 1,16,844 యూనిట్లకు చేరాయి. అయితే, ఎగుమతులు మాత్రం నిరాశపరిచాయి. గతేడాది 8,688 యూనిట్లుగా ఉన్న ఎగుమతులు, ఈసారి 7 శాతం తగ్గి 8,107 యూనిట్లకు పరిమితమయ్యాయి. పండగ సీజన్ ఉత్సాహం దేశవ్యాప్తంగా అమ్మకాలకు ఊతమిచ్చిందని ఐషర్ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్, రాయల్ ఎన్‌ఫీల్డ్ సీఈఓ బి. గోవిందరాజన్ తెలిపారు. "సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో 2.49 లక్షల మోటార్‌సైకిళ్లను విక్రయించి రికార్డు సృష్టించాం. మా కంపెనీ చరిత్రలో పండగ సీజన్‌లో ఇదే అత్యుత్తమ ప్రదర్శన. మా బ్రాండ్‌పై రైడర్లకు ఉన్న అచంచలమైన అభిమానానికి ఇది నిదర్శనం" అని ఆయన వివరించారు.



రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాల వృద్ధి, దేశంలోని టూవీలర్ పరిశ్రమ మొత్తం పుంజుకుంటున్న తరుణంలో జరగడం గమనార్హం. జీఎస్టీ సంస్కరణలు, పండగ డిమాండ్‌తో టీవీఎస్ మోటార్, సుజుకి మోటార్‌సైకిల్ వంటి ఇతర ప్రముఖ కంపెనీలు కూడా అక్టోబర్‌లో 8 నుంచి 11 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సెంటిమెంట్, కొత్త మోడళ్ల విడుదల వంటి అంశాలు దీపావళికి ముందు టూవీలర్ అమ్మకాలకు మరింత ఊపునిచ్చాయని విశ్లేషకులు భావిస్తున్నారు. క్లాసిక్ 350, బుల్లెట్, హంటర్ 350, హిమాలయన్ వంటి మోడళ్లతో మిడ్-సైజ్ మోటార్‌సైకిల్ సెగ్మెంట్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది.

## స్పోర్ట్స్

# 'వరల్డ్ కప్ టీమ్'లో ఆ నలుగురు.. ఓపెనర్‌గా మంధాన!

వన్డే ప్రపంచకప్‌లో తడబాటు నుంచి గొప్పగా పుంజుకొన్న భారత జట్టు ఛాంపియన్‌గా అవతరించింది. భావి తరాలకు స్ఫూర్తినిచ్చే విజయంతో మహిళా క్రికెట్ చరిత్రలో కొత్త చరిత్రను సృష్టించింది. దశాబ్దాల కలను సాకారం చేసుకునేందుకు మైదానంలో సర్వశక్తులు ఒడ్డిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం.. విజయంతో మెగా టోర్నీకి వీడ్కోలు పలికింది. ఈ పదమూడో సీజన్‌లో అద్భుత ప్రదర్శన చేసిన నలుగురు భారత క్రికెటర్లు వరల్డ్ కప్ టీమ్ టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్‌లో చోటు దక్కించుకున్నారు. క్రీడాభిమానులను అలరించిన వన్డే ప్రపంచకప్ ముగియడంతో ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో జట్టును ప్రకటించింది. ఇందులో భారత్ నుంచి నలుగురు, రన్నరప్ దక్షిణాఫ్రికా జట్టు నుంచి ముగ్గురు ఎంపికవ్వగా.. ఆస్ట్రేలియా జట్టులోని ముగ్గురు, ఇంగ్లండ్ నుంచి ఒకరికి చోటు లభించింది. టీమిండియా టీమిండియా విజేతగా నిలవడంలో కీలకమైన స్మృతి మంధాన ఓపెనర్‌గా, మిడిలార్డర్ బ్యాటర్‌గా జెమీమా రోడ్రిగ్స్, వికెట్ కీపర్‌గా రీచా ఘోష్.. స్పిన్ ఆల్‌రౌండర్‌గా దీప్తి శర్మలు ఎంపికయ్యారు. మెగా టోర్నీలో నాకౌట్స్‌లో శతకాలతో రెచ్చిపోయిన లారా వొల్వార్డ్ కెప్టెన్, ఓపెనర్‌గా సెలెక్ట్ అయింది. రెండు సెంచరీలు బాదిన అష్ గార్డ్‌నర్, సథర్‌లాండ్, అలనా కింగ్(ఆస్ట్రేలియా), సోఫీ ఎకిల్‌స్టోన్(ఇంగ్లండ్)లు తుది జట్టులో నిలిచారు. వరల్డ్ కప్‌తో వన్డేలకు వీడ్కోలు పలికిన న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డెవినె పన్నెండో ప్లేయర్‌గా ఎంపికైంది. వన్డే వరల్డ్ కప్ టీమ్: స్మృతి మంధాన, లారా వొల్వార్డ్(కెప్టెన్), జెమీమా రోడ్రిగ్స్, మరిజానే కాప్, అనబెల్ సథర్‌లాండ్, అష్ గార్డ్‌నర్, రీచా ఘోష్(వికెట్ కీపర్), నడినే డీక్లెర్క్, దీప్తి శర్మ, అలనా కింగ్, సోఫీ ఎకిల్‌స్టోన్. 12వ ప్లేయర్ - సోఫీ డెవినె.



### క్రాంతి గౌడ్‌కు రూ.కోటి నజరానా ప్రకటించిన మధ్యప్రదేశ్ ప్రభుత్వం!




ఐసీసీ వన్డే ప్రపంచ కప్‌లో అద్భుతంగా రాణించిన టీమిండియా క్రికెటర్ క్రాంతి గౌడ్‌కు మధ్యప్రదేశ్ ప్రభుత్వం రూ.కోటి నజరానా ప్రకటించింది. 22 ఏళ్ల యువ బౌలర్ ఎనిమిది మ్యాచుల్లో 5.73 ఎకానమీ రేటుతో బౌలింగ్ చేస్తూ తొమ్మిది వికెట్లు పడగొట్టింది. మెగా ఈవెంట్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చినందుకు ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ భారత జట్టుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వరల్డ్ కప్ స్టార్ కాంతి గౌడ్‌కు రివార్డును ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఆదివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో మన అమ్మాయిలు అద్భుతంగా రాణించినందుకు ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నానన్నారు. క్రాంతి గౌడ్ మహిళల ప్రపంచ కప్ గెలిచిన జట్టులో భాగమైనందున సత్కరించాలనుకుంటు న్నానని.. ప్రభుత్వం తరఫున రూ.కోటి ప్రోత్సాహకాన్ని ప్రకటిస్తున్నట్లు తెలిపారు. మ్యాచ్‌లో క్రాంతి అందించిన సహకారాన్ని ప్రశంసించారు. ఆమె ఛతర్‌పూర్, మధ్యప్రదేశ్‌కు గర్వకారణంగా నిలిచిందని.. భారత క్రికెటర్లు ప్రపంచవేదికపై భారతదేశం గర్వపడేలా చేశారన్నారు. కృషి, పట్టుదల, అభిరుచి ఉంటే ఏదైనా సాధించగలరన్న దానికి క్రాంతి సాధించిన విజయం ఉదాహరణ ని సీఎం యాదవ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ సరికొత్త శిఖరాలను అందుకునేందుకు అవకాశాలు, ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసింది క్రాంతి గౌడ్. ప్రపంచకప్‌లో ఏడు వన్డేలు ఆడింది. అక్టోబర్ 5న కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో పాకిస్తాన్‌తో జరిగిన హై వోల్టేజ్ మ్యాచ్‌లో పది ఓవర్లలో 20 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసింది. ఆ మ్యాచ్‌లో భారత జట్టు 88 పరుగుల తేడాతో గెలిచింది. అద్భుత బౌలింగ్ ప్రదర్శనకు ఆ మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నది. ఇక ఇప్పటి వరకు 15 వన్డేలు ఆడిన క్రాంతి 5.79 ఎకానమీతో 23 మూడు వికెట్లు తీసింది. ఒక మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీసింది. బెస్ట్ బౌలింగ్ ఫిగర్స్ 6/52. బ్యాట్‌తోనూ 682 పరుగులు చేసింది.

## ఊడ్చేసిన ఆఫ్ఘనిస్తాన్



ఆఫ్ఘనిస్తాన్ జట్టు జింబాబ్వేను వారి సొంత గడ్డపై ఊడ్చేసింది. 3 మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. నిన్న (నవంబర్ 2) జరిగిన నామమాత్రపు మూడో మ్యాచ్‌లో 9 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. ఓపెనర్లు రహ్మానుల్లా గుర్బాజ్ (92), ఇ?బ్రహీం జద్రాన్ (60) చెలరేగారు. ఆఖర్లో సెదిఖుల్లా అటల్ (35 నాటౌట్) సైతం మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. జింబాబ్వే బౌలర్లలో ఈవాన్స్ 2, నగరవ ఓ వికెట్ పడగొట్టారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే సైతం అద్భుతంగా పోరాడింది. నిర్ణీత ఓవర్లు బ్యాటింగ్ చేసి 201 పరుగులకు ఆలౌటైంది. సికందర్ రజా (51), బ్రియాన్ బెన్నెట్ (47), ర్యాన్ బర్ల్ (37), ముసేకివా (28) పోరాడారు. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లలో అహ్మద్‌జాయ్ 3, ఫజల్ హక్ ఫారూకీ, ఫరీద్ అహ్మద్ మాలిక్ తలో 2, ముజీబ్, నబీ చెరో వికెట్ తీశారు. ఈ సిరీస్‌కు ముందు ఇరు జట్ల మధ్య జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో జింబాబ్వే ఇన్నింగ్స్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

## గోండు గిరిజన మహిళగా రష్మిక మందన్నా




కన్నడ హీరోయిన్ రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం మైసా ఈ చిత్రానికి సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట రౌండప్ చేస్తూ అభిమానులు, మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. రష్మిక మందన్నా టీం అధికారికంగా షూటింగ్ మొదలు పెట్టేసినట్టు తాజాగా వార్త తెరపైకి వచ్చింది. కేరళలోని అథిరప్పిల్లీలో అధికారికంగా నేడు షూటింగ్ మొదలైనట్టు ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అంతేకాదు ఈ చిత్రంలో రష్మిక మందన్నా గోండ్ గిరిజన మహిళగా కనిపించనుందట. ఇప్పటికే విడుదల చేసిన రష్మిక మందన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇదివరకెన్నడూ కనిపించని నయా అవతార్‌లో మెస్మరైజ్ చేయబోతున్నట్టు ఫస్ట్ లుక్ హింట్ ఇచ్చేస్తుంది. మైసా సినిమాతో డైరెక్టర్‌గా పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ఈ డెబ్యూ డైరెక్టర్ ఇటీవలే మైసా నుంచి రష్మిక మందన్నా అగ్రెసివ్ లుక్ లాంచ్ చేసి హైప్ క్రియేట్ చేస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పుష్ప ఫ్రాంచైజీలో శ్రీవల్లిగా డీగ్లామరస్ రోల్‌లో ఇరగదీసిన రష్మిక మందన్నా మరి గోండు గిరిజన మహిళగా మైసా సినిమాలో ఎలా మెప్పించబోతున్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ మూవీలో పుష్ప 2 విలన్ తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తున్నాడని తెలిసిందే. రష్మిక మందన్నా సినిమాలో తారక్ పొన్నప్ప నటించడం ఇది రెండోసారి. ఈ మూవీకి ప్రభాస్ కల్కి 2898 ఏడీ ప్రాజెక్ట్‌కు పనిచేసిన ఆండీ లాంగ్ గ్యుయెన్ స్టంట్ మాస్టర్‌గా పని చేస్తున్నాడని సమాచారం.



## రమ్యకృష్ణని ఇలా ఎప్పుడూ చూడలేదు!

రమ్యకృష్ణ పేరు చెప్పగానే ఇప్పటి జనరేషన్‌కి అయితే శివగామి పాత్ర గుర్తొస్తుంది. ఎందుకంటే 'బాహుబలి'లో ప్రభాస్, రానానే కాదు రమ్యకృష్ణ తన యాక్టింగ్‌తో చూపించిన డామినేషన్.. ఈమె సెకండ్ ఇన్నింగ్స్‌కి మంచి పునాది వేసింది. ఇప్పటికీ వరస సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న రమ్యకృష్ణ.. మునుపెన్నడూ లేని విధంగా ఓ దెయ్యం సినిమా కోసం కనిపించనుంది. ఆ లుక్స్ ఇప్పుడు తెగ వైరల్ అయిపోతున్నాయి. గత కొన్నాళ్లుగా సినిమాలైతే చేస్తున్నాడు గానీ ఒక్క హిట్ కూడా కొట్టలేకపోతున్న డైరెక్టర్ రాంగోపాల్ వర్మ.. ప్రస్తుతం 'పోలీస్ స్టేషన్ మైన్ భూత్' అనే హారర్ మూవీ తీస్తున్నాడు. మనోజ్ బాజ్‌పాయ్ పోలీస్‌గా చేస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం ఈ చిత్రం గురించి చెప్పిన ఆర్జీవీ.. ఓ డాన్ చనిపోయి దెయ్యమవుతాడని, తర్వాత పోలీసులని ఎలా ఇబ్బంది పెట్టాడనేది కాన్సెప్ట్ అని చెప్పుకొచ్చాడు. ఈ సినిమాలో రమ్యకృష్ణ కూడా నటిస్తోందని, ఆమె లుక్ ఇదేనంటూ ఆర్జీవీ రెండు ఫొటోలని పోస్ట్ చేశాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా మాసీగా కనిపించింది. చేతిలో సిగరెట్, ముఖంపై బొట్లు, జీన్స్ ప్యాంట్ ఇలా టామ్ బాయ్ తరహాలో కనిపించింది. అయితే ఈమెది దెయ్యం పాత్ర కాదని ఆర్జీవీ క్లారిటీ ఇచ్చాడు. రీసెంట్‌గానే 'బాహుబలి' మూవీ ఎపిక్ పేరిట రిలీజైంది. దీంతో ఆ మూవీ లవర్స్.. మా శివగామిని ఇలా మార్చేశారేంటి? అని మాట్లాడుకుంటున్నారు.



## ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ సినిమాపై తప్పుడు ప్రచారం

జూనియర్ ఎన్టీఆర్ , ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాపై ఈ మధ్య చాలా రూమర్స్ వస్తూనే ఉన్నాయి. మూవీ షూటింగ్ ఆగిపోయిందని కొద్దిరోజులుగా ప్రచారం అయింది. అయితే, ఈ మూవీ రెండు భాగాలుగా రానుందని సోషల్‌మీడియాలో కొత్త ప్రచారం తెరపైకి తీసుకొచ్చారు. 'డ్రాగన్' పేరుతో తెరకెక్కుతున్న ఈ మూవీని మొదట ఒకే భాగంగా నిర్మించాలని మేకర్స్ అనుకున్నారట.. కానీ, రన్ టైమ్ ఎక్కువ రావడంతో రెండు పార్ట్స్‌గా విడుదల చేసేందుకు వారు ప్లాన్ చేసినట్టు ప్రచారం జరిగింది. అయితే, అందులో ఎలాంటి నిజం లేదని ప్రశాంత్ నీల్ టీమ్ తాజాగా ఒక పోస్ట్ చేసింది. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇప్పటికే కేజీఎఫ్ చిత్రాలను రెండు భాగాలుగా నిర్మించి భారీ విజయాన్ని అందుకున్నారు. సలార్ మూవీని కూడ రెండు పార్ట్స్‌గా విడుదల చేస్తామని తెలిపారు. ఇదే క్రమలో తారక్ సినిమాను కూడా సీక్వెల్ ప్లాన్ చేసే పనిలో ఉన్నారని ఒక వార్త ట్రెండ్ అయింది. అయితే, తాజాగా ప్రశాంత్ నీల్ టీమ్ ఖండించింది. '





## చిరు సినిమాలో వెంకీ పాత్ర ఇదే.. మెగాస్టార్‌తో కలిసి ఓ రేంజ్‌లో సందడి

మెగాస్టార్ చిరంజీవి విక్టరీ వెంకటేష్ కలయికలో భారీ ఎంటర్టైనర్ రానుందనే వార్తతో టాలీవుడ్ అభిమానుల్లో జోష్ మొదలైంది. ఈ ఇద్దరు స్టార్ హీరోలు కలిసి తెరపై కనిపించబోతున్న చిత్రం "మన శంకర వర ప్రసాద్ గారు". ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఈ చిత్రం తెలుగు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా కూడా మారింది. ఈ చిత్రానికి హిట్ చిత్రాల దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్, పాజిటివ్ ఎనర్జీతో నిండిన కథలను చెప్పడంలో దిట్ట అయిన ఆయన, ఈసారి చిరంజీవి - వెంకటేష్‌ల కలయికను మరింత స్పెషల్‌గా మలచబోతున్నారని సమాచారం. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, వెంకటేష్ ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. అయితే అది సాధారణ పాత్ర కాదు. ఆయన పాత్రలో వినోదంతో పాటు కథను కీలక మలుపు తిప్పే ఎమోషనల్ ఎడ్జ్ కూడా ఉంటుందట. ఆయన ఎంట్రీ తర్వాత సినిమా నరేషన్ మరింత ఉత్సాహంగా మారుతుందని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవి, వెంకటేష్ కలిసి నటించిన కొన్ని సన్నివేశాలు ఇప్పటికే షూట్ పూర్తయ్యాయి. వాటిలో ఒక పాటను కూడా చిత్రీకరించారు. ఆ పాట సినిమాకు హైలైట్‌గా నిలవనుందని టీమ్ విశ్వాసం. మెగాస్టార్ మాస్ అటిట్యూడ్, వెంకటేష్ కూల్ కామెడీ, అనిల్ రావిపూడి ప్రత్యేక నేరేషన్ స్టైల్ కలగలిపి ఈ సినిమా పూర్తి ప్యాకేజీ ఎంటర్టైనర్‌గా రానుందని తెలుస్తోంది. చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లోని భారీ సెట్స్‌లో వేగంగా జరుగుతోంది. అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకునేలా భావోద్వేగాలు, కామెడీ, ఫ్యామిలీ ఎలిమెంట్స్ మేళవింపుతో స్క్రిప్ట్ రూపొందించబడిందని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. వచ్చే సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేయాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి %-% విక్టరీ వెంకటేష్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం టాలీవుడ్‌లో అత్యంత పెద్ద మల్టీస్టారర్‌గా నిలవనుంది. అభిమానుల అంచనాల ప్రకారం, "మన శంకర వర ప్రసాద్ గారు" వచ్చే ఏడాది బాక్సాఫీస్ వద్ద భారీ హిట్‌గా నిలిచే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఈ సినిమాకి పోటీగా పలు చిత్రాలు విడుదల అవుతున్నా, అందరి దృష్టి ఈ మూవీపైనే ఉంది.

## నాని తల్లిగా సోనాలి కులకర్ణి

### ది ప్యారడైజ్ టీం కొత్త వార్త ఇదే..!

దసరా ఫేం శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని నటిస్తోన్న చిత్రం ది ప్యారడైజ్ ఈ చిత్రంలో మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తుండగా.. ఇప్పటికే విడుదల చేసిన లుక్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. చాలా రోజుల తర్వాత ఈ చిత్రం నుంచి ఆసక్తికర అప్‌డేట్‌తో అభిమానుల్లో జోష్ నింపుతున్నాడు నాని. ది ప్యారడైజ్‌లో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటి సోనాలి కులకర్ణి ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుందని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మేకర్స్ అధికారికంగా బర్త్ డే విషెస్ తెలియజేస్తూ స్పెషల్ విషెస్ తెలియజేశారు. ఈ చిత్రంలో సోనాలి కులకర్ణి నాని తల్లిగా కనిపించనుంది. రా స్టేట్‌మెంట్ గ్లింప్స్‌లో లో ఆమె వాయిస్ ఇంటర్‌నెట్‌లో సంచలనం సృష్టించింది. సినిమాలో ఆమె నటన సెన్సేషన్ సృష్టించడం ఖాయం.. అంటూ మేకర్స్ షేర్ చేసిన పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. పూణేకు చెందిన సోనాలి కులకర్ణి తెలుగులో నటిస్తోన్న తొలి సినిమా ఇదే. మరాఠీ, హిందీ, గుజరాతీ, ఇంగ్లీష్, ఇటాలియన్ భాషల్లో పలు సినిమాలు చేసింది సోనాలి కులకర్ణి. మరి శ్రీకాంత్ ఓదెల ఈ సీనియర్ నటిని సిల్వర్ స్క్రీన్‌పై ఎలా చూపించబోతున్నాడన్నది ఆసక్తికరంగా మారింది. ఈ మూవీని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. కిల్ యాక్టర్ రాఘవ ఈ సినిమాలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఓ వైపు బ్లాక్ బస్టర్ దసరా కాంబో కావడం, మరోవైపు నాని-అనిరుధ్ కాంబోలో జెర్సీ, గ్యాంగ్ లీడర్ తర్వాత వస్తున్న సినిమా అవడంతో ది ప్యారడైజ్‌పై అంచనాలు భారీగానే ఉన్నాయి.



Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108